# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక


జూన్ 2025

వెల : రూ. 10.00







## ఏప్రియల్ 6న శ్రీ కాళీవనాశ్రమం నందు జరిగిన శ్రీరామనవమి పూజా దృశ్యములు



శ్రీ సద్గురు పాదపూజ



శ్రీ సీతారాముల కళ్యాణం



భక్తులచే శ్రీ సీతారాముల సాముహిక పూజలు



పెదనిండ్రకొలను ఆశ్రమ శాఖలో జరిగిన శ్రీరామనవమి పూజా దృశ్యం

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 44 సంచిక 10
పేజీలు 44
జూన్ 2025

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా


Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో ............................ ....... పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ......................................... 5
అమ్మమాట.................................... ............ 7
శ్రీ స్కందదేవానందగిరి స్వామి ............8
విమర్శ ................................................ ..............11
సుమాంజలి ....................................................14
గోమాత ............ .................. ............................16
భగవద్గీత సాధన దీపిక ..............................18
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ....... 21
మల త్రయం ........ ..........................................23
సతి - శివుడు ...................................... ......25
నారద భక్తి సూత్రములు ............... ..............28
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....31
తర్కము- తాత్వికత ....................................32
నిరీక్షణ ..................................................................35
శ్రీ గురుగీత .......................................... .........37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ........................... ...................41

# శ్రీ కాళీ ప్రసాద శతకము

- పాలూరి ప్రసాద్



1. వెలుగున్న యెడ చీకటెక్కడ
దైవమున్న యెడ క్షుద్రమెక్కడ
గురువున్న యెడ యజ్ఞానమెక్కడ
కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥

తా: ఎక్కడైతే వెలుగు ఉంటుందో అక్కడ చీకటికి తావు వుండదు కదా! అలాగే దైవత్వం (దివ్ అంటే ప్రకాశం) లో మళ్ళీ క్షుద్రత్వం ఆపాదించి కొందరిని క్షుద్ర దేవతలని, ఇంకొందరిని ఉత్తమ దేవతలని ఎలా విభజించగలుగుతాం? అజ్ఞానం వల్లనే ఇటువంటి భేదాలన్నీ పుట్టుకొస్తాయి. కానీ ఎక్కడైతే గురువు ఉంటారో అక్కడ ఇంక అజ్ఞానానికి చోటు ఉండదు. గురు ప్రకాశం అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేస్తుంది. అటువంటి సమర్ధ సద్గురువులైన **శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వరప్రసాద బాబూజీ** ముఖస్తుగా వెలువడిన ప్రతి వాక్కు మనలను జ్ఞానమనే కాంతిబాటలో నడిపించి మోక్ష సామ్రాజ్యానికి చేరుస్తుంది. (ఇంతటి మహాత్ములయిన తమరు పోలేరమ్మ, పోతరాజు వంటి క్షుద్ర దేవతల విగ్రహ ప్రతిష్టకు వెళ్ళడం ఏమిటని ప్రశ్నించిన కొందరు పండితులకు శ్రీగురుదేవులు అందించిన బోధ ఆధారంగా.)

1. నిజమైన శిష్యుడు వేటిని త్యజించాలి? వేటిపైన మక్కువ పెంచుకోవాలి?
2 శ్రీకృష్ణుడు అర్జునుడిని ఏమని ఎద్దేవా చేశాడు?
3 ప్రహ్లాదుడు ఎలా నారాయణ రూపాన్ని ధరించాడు?
4 ఎలుక అందమైన స్త్రీగా ఎలా మారిపోయింది?
5 మనం చేసే పనులన్నింటిలో ఏదో ఒక దోషం ఉంటుందని ఎవరు చెప్పారు?
6 హనుమంతుడు, ఇతర వానరుల కోసం గుహలో వేచి చుస్తున్న స్త్రీ ఎవరు?
7 చెట్టు క్రింద పడుకున్న బాటసారిని పెద్దపులి ఎందుకు మ్రింగివేసింది?
8 శ్రీ బాబూజీ ఎన్ని మల్లెల బరువున్నారు?
9 జంతువులన్నీ శ్రీరామచంద్రుని ఎందుకు అనుసరించాయి?

***సమాధానాలు లోపలి పేజీలలో ...........................***

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

21-6-1981

శ్రీబాబు ఈరోజు ఉదయం భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీ బాబు దర్శనార్థం మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్‌గారు వారి బంధువులు వచ్చారు. శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'పరమాత్ముడు ఎవరినీ సోమరిగా ఉండమనలేదు. ప్రతివారు భగవంతుడు వారికిచ్చిన శక్తిని సద్వినియోగం చేసుకోవాలి. వారి కర్తవ్యం నెరవేర్చాలి. అయితే ఉన్న శక్తి ఎక్కడిది? అదే చైతన్యము. దానినే **ప్రజ్ఞానం బ్రహ్మ** అనవచ్చు. కాని మానవులంతా ఆ ప్రజ్ఞ తమదిగా భావిస్తారు. అదే దేహభావన, లేక ఇంద్రియ భావన, లేక అజ్ఞానము. తాను ఎంతగానో ప్రేమించిన భార్యలో చైతన్యము తప్పుకుంద నుకుందాం. మిగిలినది ప్రేతేకదా! ఆ ప్రేత స్వరూపాన్ని ప్రేమించగలడా? ఏమండీ డాక్టరుగారూ! ఆ ప్రేతని మీరు ఏమంటారు?



శవము అని అంటారనుకుంటాను. ఆ శవాన్ని ఎన్ని రోజులు వుంచ గలుగుతారండీ?' అని ప్రశ్నించి 'పోనీ రెండు రోజులు వుంచ గలుగుతారేమో' అన్నారు. మళ్ళీ మాట్లాడుతూ శ్రీ బాబూజీ, 'నా భార్య పోయింది' అని ఏడుస్తాడు ఒకడు. పోయింది ఎవరు? ఉన్నది ఎవరు? కొంపదీసి ఇద్దరు భార్యలు కాదు కదా! అంటే ఇంతవరకు ప్రేమించిన వస్తువు చైతన్యము అన్నమాట. మానవుడు ప్రేమించ వలసినదీ, ప్రేమించేదీ చైతన్యమునే. అంతేకానీ ఇంద్రియ సహితమైన దేహమును కాదన్నమాట.

చనిపోయిన భార్య కండ్లలోకి చూసి 'ఏమే ఏమైంది నీకు?' అంటే పలుకుతుందా? పోనీ చెవి దగ్గర చేరి ఏడిస్తే వినబడుతుందా? ఇంద్రియాలు  ఉన్నాయి కాని వాటికి శక్తి ఎక్కడిది? జ్ఞాని ఆ చైతన్యాన్నే ప్రేమిస్తాడు. ఇంద్రియ సుఖాలని ప్రేమించటమే అజ్ఞానము. జ్ఞాని సర్వత్రా ఆ చైతన్యాన్నే దర్శిస్తాడు. అదే అభేదదృష్టి. అందువలననే జ్ఞానికి స్త్రీ,

పురుష భేదం ఉండదు. మీకు ఒక ఉదాహరణ చెప్తాను. ఈ ఫ్యాను ద్వారా గాలినిచ్చేది ఆ లైటుద్వారా కాంతినిచ్చేది లేక ఏదైనా యంత్రము పనిచేసి ఉత్పత్తినిచ్చేది ఒక శక్తియే కదా! ఆ శక్తికి రూపము వుందా? ఈ శక్తిని ప్రకాశింపజేసే ఆత్మశక్తి కూడా రూపనామ క్రియారహితమైనది. అదే **ప్రజ్ఞానం బ్రహ్మ**. భక్తుడు పరమాత్ముడిని సాకారంగా దర్శిస్తున్నాడు. నిరాకారంగానూ దర్శిస్తున్నాడు. సాకార నికార స్థితికి అతీతుడై సర్వత్రా ఆత్మవస్తువుని దర్శిస్తున్నాడు. పరమాత్మలో లేనివి పోగొట్టుకుంటే నీవే పరమాత్ముడవవుతావు.

అందుచేతనే ఆనాడు శ్రీరామచంద్రుడు వసిష్ఠులవారితో కలసి విశ్వామిత్రుని వద్దకు వెళ్ళినపుడు అరణ్యంలోని జంతువులన్నీ ఆయన వెంట తరలివెళ్ళాయి. తుమ్మెదలు ఝుంకరించాయి. ఏనుగులు ఘీంకరించి ఆ మహాత్ముని దారికి అడ్డం వచ్చిన చెట్లన్నిటిని పీకివేశాయి. అలాగే క్రూర మృగాలన్నీ వారివెంట వెళ్ళాయి.

ఇదంతా చూసి శ్రీరామచంద్రుడు వసిష్ఠుల వారితో 'గురుదేవా! నాలో ఏముంది?' అని ప్రశ్నిస్తాడు.

దానికి వసిష్ఠులవారు సమాధానం చెపుతూ 'స్వామీ నీలోని ఆకర్షణ మా అందరిని తన్మయుల్ని చేస్తున్నది. మిమ్మల్ని నా కౌగిట బంధించాలని ఉంది. మీ చరణారవిందములపైబడి ఈ గడ్డంతో మిమ్మల్ని ఒత్తివేయాలని ఉంది. మాకే అలాఉంటే ఈ జంతువులకు ఎందుకు ఉండదు?' అని చెప్పారు.

చూశారా! శ్రీరామచంద్రుడు అటువంటి సుందరాకారుడు. 'సు' అంటే ఆత్మవస్తువు. ధర అంటే భూమి అని అర్థం. అంటే అంతటా ప్రకాశించే ఆత్మవస్తువు అని అర్థం.

అలా తత్త్వ విచారణ చేస్తూ మీ విధి నిర్వహణ చేశారనుకోండి అప్పుడు మీలో ఉన్న శక్తి ఇంకా బాగా ప్రకాశిస్తుంది' అన్నారు.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

# మాధవ స్మరణ

"మమకారాన్ని హరించేది మాధవస్మరణ. 'నేను', 'నాది' అనే అహంకార, మమకారములకు లోనయి మానవుడు, తనని రక్షించే ఆ మాధవ స్మరణని కూడా మరచిపోతున్నాడు. తద్వారా యిక్కట్ల పాలయి పోతున్నాడు. ఆ భగవానుని మరచిపోకుండా, మాటి మాటికీ గుర్తుకు తెచ్చేది 'సత్సంగం'. మనసుని నిరంతరం సత్యవస్తువుతో కూర్చి యుంచడమే 'సత్సంగం'. సత్య వస్తువుకు మార్పు అనేది లేదు కనుక, దానిని ఆశ్రయించడం వలన, నిరంతరం మార్పుకు లోనయే మనము కూడా, ఆ సత్యవస్తు రూపాన్నే పొందగలుగుతాము.



ఈ సత్య వస్తువునే పరమాత్ముడని, దేవుడని, అనేక పేర్లతో వ్యవహరిస్తున్నాము. విశ్వనాధుడు కాశీలోనో, కేదారనాథ్‌లోనో మాత్రమే లేడు. మంచి మనసులోనే వుంటాడాయన. మన మనసులో మాధవుడిని దర్శించాలంటే, మనకి ఒక లక్ష్యం అవసరం. ఆ లక్ష్యార్ధాన్ని ప్రసాదించేవారే సద్గురుదేవులు. మన సందేహాలనన్నిటినీ తీర్చి, మనలోని ఆత్మారాముడి దర్శనం మనకి చేయిస్తారు వారు. అట్టి గురుమూర్తి యందు ప్రహ్లాదకుమారుడి వలె, ఆరూఢమైన విశ్వాసం కలిగి వుండాలి.

తన తండ్రి తనని ఎన్ని కష్టాలు పెట్టినా, ప్రహ్లాదుడేనాడూ కూడా, వాటిని కష్టాలని తలవలేదు. తాను తన తల్లి గర్భమునందుండగా నారదులువారు చేసిన 'అష్టాక్షరీ' మంత్రోపదేశమును ఏనాడూ విస్మరించలేదు. సతతం నారాయణ స్మరణతో, అంతటా ఆ నారాయణుని దర్శించడమే గాక, తానే ఆ నారాయణరూపాన్ని ధరించాడు. గురు ముఖస్థుగా వచ్చిన ఆజ్ఞని ఏనాడూ ఉల్లంఘించలేదు.

కనుక, మనం కూడా, సద్గురుదేవులని ఆ విధంగా ఆరూఢమైన విశ్వాసంతో ఆశ్రయించి, వారు చెప్పిన బాటలో తు.చ. తప్పకుండా నడుచుకున్నట్టయితే, వడ్ల గింజలో నుండి బియ్యపు గింజ బయట పడినట్టు, మనలోని ఆత్మ వస్తువుని కబళించి వున్న అహంకార మమకారములనే రెండు పొరలు హరించి, మానవత్వంలోని మాధవత్వం బయటపడతుంది. అట్టి మాధవత్వాన్ని ప్రసాదించే గురుపాదుకలు అఖండభక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రసాదించి, సర్వదా రక్షించుగాక!"

## శ్రీ స్కందదేవానందగిరి స్వామి - తుళ్ళూరు

(గత సంచిక తరువాయి) - సేకరణ భాగవతుల హనుమత్ జయప్రద

గురుదేవులు మనలాగే ఆయన చేష్టలు చేస్తున్నాడు కదా, ఆయనకి మనలాగే కాళ్ళు, చేతులు ఉన్నాయి కదా అని భావించకూడదు.

దానికి చిన్ని ఉదాహరణ. ఆది శంకరాచార్యుల వారు, ఒక చోట శిష్యులతో నడుస్తూ వెళ్తున్నారు, బాగా దప్పిక అయినది. ఒక సురాపానం చేసే చోటు అది, బాగా దప్పికగా ఉంది, దాహానికి ఏమైనా ఇవ్వండి అంటే, అక్కడ సురాపానం మాత్రమే వుందని చెప్పారు. అప్పుడు ఆయన అదే త్రాగుతారు. ఆయన త్రాగారు కదా అని, మిగిలి శిష్యులు కూడా అదే త్రాగుతారు. మళ్ళా ఇంకొక రోజున దాహం వేస్తే ఏది దొరకక పోతే, ఒక ఇనుము కాల్చేవాడు కనబడుతాడు. అతని దగ్గర ఏమిలేదు, బాగా కాలిన సీసం మాత్రమే ఉన్నది అని చెప్తాడు. ఆ వేడి సీసాన్ని తీసుకుని శంకరాచార్యుల వారు త్రాగుతారు. శిష్యులు త్రాగలేకపోతారు.

గురుదేవుని తక్కువ అంచనా వెయ్యొద్దు. గురు అనగానే – అనేక జన్మల పాతకాలు పటాపంచలు అయిపోతాయి. మనలోని చీకట్లని తొలిగించడానికే, మనకి గురుదేవులు ఉన్నారు. వారే, శ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద్ బాబూజీ మహారాజ్ వారు. వారి అనుంగు బిడ్డే, అమ్మ శ్రీ మాతాజీ వారు.

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి – భగవద్గీత 6-30

అన్నిటిలో ఉన్నది పరమాత్మయే, నాలో ఉన్నది కూడా పరమాత్మయే, గురుదేవులలో ఉన్నది కూడా పరమాత్మయే. దీపకుడు అలాగే ఆలోచించాడు. మహా కఠినమైన పరీక్షలు పెడుతున్నాడు గురుదేవుడు. ఒక మాములు పరీక్షలో ఉత్తీర్ణత చెందాలి అంటే బాగా చదువుతాము. ఒక్క మార్కు కూడా పోకూడదు అని రాత్రిపగలు చదువుతాము. అటువంటిది గురుదేవుల యొక్క అనుగ్రహానికి, ఎక్కడ మనం దూరం అవుతామో అని, అనుక్షణం భయపడాలి, అనుక్షణం ఆస్వాదించాలి. దాని కోసమే అహర్నిశలు పాటుపడాలి.

గురుదేవుని దగ్గర ఒక మంత్రము తీసుకున్నాము అంటే, అనుష్ఠానం తప్పని సరిగా ఉండి తీరాలి. అనుష్ఠానం ఉన్నది అంటే, లౌకిక కోరికలను మీ మనస్సు కోరుకోదు. ఎందుకని? ఒక సారి కాచి తోడు పెట్టిన పెరుగుని చిలికిన వెన్న, మళ్ళా తిరిగి అదే మజ్జిగలో కలుస్తుందా? అలాగే, ఒక సారి మంత్ర బలము వల్ల విషయాదుల

నుండి విడిపోయిన మనస్సు మళ్ళీ విషయాదుల వైపు మరలదు. దీపకుడు, అలాగే కష్టపడుతున్నాడు, తన గురువుగారికి వచ్చిన వ్యాధి ఎలా నయం అవుతుంది అని బెంగ పడుతున్నాడు.

దేహము ఎల్ల శిధిలమై నేనేనాడు చూడనట్టి గురుదేవుని బాధలను చూస్తూ కళ్ళ వెంట అశ్రువులు జారిపోతున్నాయి, బాగాఏడుస్తున్నాడు అయినా కూడా క్షణం విశ్రాంతి నొందక ఎన్ని సపర్యలు చేసినా గాని ఏమి లాభం! చేతికి దక్కింది ఏది దొరికితే అది విసిరిగొడుతున్నారు. నానా ఇబ్బందులు పెడుతున్నారు గురుదేవులు. వేళకింతయు తిండి లేక ఆకలియంచు మనసు రోదించిన గురు సేవకై ఆకలి తీర్చుకోవడానికి ఏమున్నదక్కడ? ఒకవేళ ఏమైనా తిందాం అని అనుకున్నాడు అనుకోండి, అక్కడ శరీరం ఎలా ఉన్నది? అయన ఎలా బాధపడుతున్నాడు? ఇలాంటి స్థితిలో కూడా ఆయన అంత సేవ చేస్తుంటే, నువ్వేం చేశావురా, ఎందుకోసం వచ్చావు అని కసిరి కొడ్తుంటే తట్టుకోలేక పోతున్నాడు దీపకుడు.

ఎప్పుడూ కూడా ఎంతో గొప్పగా చూసే మా గురుదేవులేనా ఇలా మాట్లాడుతున్నారు అని, చాలా బాధపడిపోతున్నాడు. ఇదిలా వుండగా వారి యొక్క అవసాన దశ వొచ్చింది. ఒక రోజు బ్రహ్మదేవుడు కనపడి, నీకు ఏమి కావాలో కోరుకో అన్నాడు, దానికి దీపకుడు 'స్వామి మిమల్ని నేను ప్రార్ధించలేదు, నాకు ఏమీ అవసరం లేదు, నాకు గురుభక్తి నిశ్చలంగా వుండేలాగా అనుగ్రహించండి చాలు' అని అంటాడు. ఆ తర్వాత శివుడు కూడా దర్శనం ఇస్తాడు, అప్పుడు కూడా దీపకుడు అలాగే అంటాడు.ఆ తర్వాత గురుదేవులకు జరిగినది చెప్తాడు.

గురుదేవుడు, నీ సంకల్పం లేకుండా, వారు ఎందుకు వస్తారు? అని అనగానే దీపకుడు మీరు తప్ప నాకు వేరే ఏదీ అవసరం లేదు, మీ పాదాల యందు నిశ్చలమైన భక్తిని ప్రదించండి అని అనగానే గురుదేవులు 'నిన్ను శోధించడం కోసమే నేను ఆయా మూర్తుల రూపంలో పరీక్షించాను, నీవు నా పరీక్షలో గెలిచావు' అని అంటారు.

మనము కూడా గురుదేవులకు అంతటి సేవ చేసుకోవాలి. ఒక చిన్న మాట అంటే మనము తట్టుకోలేకపోతున్నాము, వెంటనే లేచి వెళ్ళిపోతాము. కానీ తట్టుకోగలము అది ఎప్పుడు? నా గురుదేవులు "సాక్షాత్ త్రిమూర్త్యాత్మకమైన పరబ్రహ్మ స్వరూపము" అని ఏది చేసినా కూడా ఆయన నా యొక్క యోగాన్ని, క్షేమాన్ని గురించి చేస్తారు అని ఎప్పుడైతే మనము విశ్వసిస్తామో, అప్పుడు వారిని త్రికరణ శుద్ధిగా సేవిస్తాము .

“త్వమేవ మాతచ పితా త్వమేవ । త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ । త్వమేవ సర్వం మమ దేవదేవ”

అని చాలా మంది అంటూ ఉంటారు, “మా యొక్క తను మనఃప్రాణధనాలని, గురువులకి సమర్పించాము” అని. కానీ సర్వకాల సర్వఅవస్థల యందు ఎవరైతే గురుదేవుల దివ్య అవతారాన్ని ఆశ్రయించి, గురువు సాక్షాత్ పరబ్రహ్మగా భావిస్తారో, వారికి సర్వం తానే అయ్యి దర్శనం ఇస్తారు గురుదేవులు. అప్పడు మనం ఏమి అవుతాము? మనం కూడా సాక్షాత్ పరబ్రహ్మలమే అవుతున్నాము.

ఒక బాటసారి వెళ్తున్నాడు, దారిలో ఏటి ఒడ్డు దాటవలసి వచ్చింది, దానిని దాటాలి, ఏదైనా చెట్టు ఉంటే బావుణ్ణు, కాసేపు విశ్రాంతి తీసుకుని వెళ్ళవచ్చు అనుకున్నాడు. వెంటనే అక్కడ ఒక చెట్టు ప్రత్యక్షమైనది ‘హమ్మయ్య ఈ పూటకు ఇది చాలు’ అనుకున్నాడు, హాయిగావుంది కానీ ఆకలి బాగా వేస్తోంది, ఏ దేవుడు అయినా కనీసం సామాన్య భోజనం అయినా అనుగ్రహిస్తే బావుంటుంది అని అనుకున్నాడు, అనుకోగానే వెంటనే భోజనం వచ్చేసింది, ఆ తర్వాత దప్పిక అయింది నీళ్ళు కావాలి అనుకున్నాడు, నీళ్ళు వచ్చేసాయి. ఆ తర్వాత, మా శ్రీమతి ఇంట్లో ఉన్నది తను కూడా వచ్చి కాసేపు సేవ చేస్తే బావుంటుంది కదా అనుకున్నాడు వెంటనే భార్య వచ్చేసింది, ఆ తరువాత నిద్రలోకి జారుకుని, ‘నేను ఏది అనుకుంటే అవి వచ్చేస్తున్నాయి, ఇదంతా నిజమేనా? పొరపాటున ఏ పెద్దపులో వచ్చి మింగేయదు కదా’ అని అనుకున్నాడు వెంటనే ఒక పెద్ద పులి వచ్చి మిగేసింది. అందువలన నమ్మకం అనేది ఎలా ఉండాలి అంటే, ‘మన శ్వాస విడిచేంతవరకు, ఆ భగవంతుని దివ్యచరాణారవిందముల యందు విశ్వాసాన్ని చెదరనీయకూడదు’.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జూన్ 2025 :*** AS 8540, 8541, 9045, PK 0097

***జులై 2025 :*** AS 6900, 8021,8149, 8542, PK`0098, 0099

# విమర్శ

- పాలూరి కాళీప్రసాద్

అశేష జీవరాశులలో భగవంతుడు మానవునికి మాత్రమే ఇచ్చిన వరం బుద్ధి. ఏది మంచి, ఏది చెడు అని విచారణ చేసి మంచిని ఎంచుకొనే శక్తి ఈ బుద్ధికి మాత్రమే ఉంది. ఈ విచారణనే విమర్శ అని కూడా అంటారు. శ్రీ బాబూజీ మహరాజ్ వారు 'మీరు ప్రతిరోజూ రాత్రి పడుకొనే ముందు ఆ రోజు మీరు చేసిన పనులను, ఆలోచనలను ఒకసారి పునరావలోకనం చేసుకొని ఆయా పనులు, లేక ఆలోచనలు ఎంతవరకు మీ సాధనకు ఉపయోగ పడుతున్నాయి? అందులో ఏవేవి మిమ్మల్ని అధోగతి పాలు చేస్తున్నాయి? అని ఆత్మవిమర్శ చేసుకోవటం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి' అని చెప్పేవారు. ఇటువంటి ఆత్మవిమర్శ వలన ఎప్పటికప్పుడు మనం ప్రయాణించే మార్గం సరియైనదో కాదో మనకు అంచనా వస్తుంది. చెడు మార్గంలో ఎక్కువ దూరం ప్రయాణం చేసేలోగానే మార్గాన్ని మరల్చుకొని తిరిగి మంచి మార్గానికి రావడానికి అవకాశం ఏర్పడుతుంది.

అయితే మనలో ఎంతమంది ఇలా ఆత్మవిమర్శ చేసుకుంటున్నాం? మన జీవితంలో ఎక్కువ భాగం ఇతరులు చేసే పనులలో మంచిచెడులను ఎంచి వారిని విమర్శించడానికే సరిపోతోంది. ఒకవేళ మన తప్పులను అంతరాత్మ ఎత్తి చూపినా, ఆ తప్పు చేయడానికి ఏదో బలవత్తర కారణం ఉందని మనకు మనం సర్ది చెప్పుకొని మన తప్పులని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తాం. ఇంకా మనం చేసే చిన్న చిన్న మంచి పనులను కూడా భూతద్దంలో చూపిస్తూ అందరూ గుర్తించాలని తాపత్రయ పడతాం. ఆత్మస్తుతి, పరనింద ఈ రెండూ మహాపాపాలని మన ఆర్ష ధర్మం బోధిస్తోంది.

అయితే గురుదేవుల బోధలతో మనం మంచి మార్గంలోకి మారినా, మన చుట్టూ ఉన్న ప్రపంచం మారిపోదు కదా! మనం ఏమి చేసినా అందులో ఏదో ఒక లోపాన్ని పసిగట్టి మనలను విమర్శించేవారు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. అలా మనకు విమర్శ ఎదురైనప్పుడు మన మనస్సు తోక త్రొక్కిన త్రాచు లాగా సర్రున లేస్తుంది. అయితే ఇక్కడే మన వివేకాన్ని ఉపయోగించుకొని కొద్దిగా నిదానించాలి.

**'వినదగు నెవ్వరు చెప్పిన వినినంతనె వేగపడక వివరింప దగున్, కని కల్ల నిజము తెలిసిన మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ'**

ఎవరైనా ఒక మాట అనగానే వెంటనే ఆవేశపడిపోకుండా ఒక్క క్షణం ఆగి వారి మాటలలో నిజానిజాలు తరచి చూసుకోవాలి. ఎందుకంటే ఎంతటి అనుభవజ్ఞుడయినా, తాను చేసే పనిలో ఎంతటి కౌశల్యం సంపాదించినా ఎక్కడో ఒకచోట ఏదో ఒక లోపం వుండక పోదు. **'సర్వారంభా హి దోషేణ ధూమేనాగ్ని రివావృతాః'** - అగ్ని చుట్టూ ఎప్పుడూ పొగ ఆవరించుకొని ఉన్నట్లే మనం చేసే అన్ని పనులూ ఏదో ఒక దోషంతో ఆవరించుకొని ఉంటాయని సాక్షాత్తూ గీతాచార్యుడే సెలవిచ్చాడు కదా! కాబట్టి మనం ఒక్క క్షణం ఆగి ఎదుటివారి విమర్శలో ఎంతవరకు నిజం ఉన్నదని మనం చేసిన పనినో, మన వ్యక్తిత్వాన్నో ఆత్మవిమర్శ చేసుకొని నిజంగానే అందులో దోషం ఉంటే దానిని సరిచేసుకొనే ప్రయత్నం చేయాలి.

**'అపరాధముల నెంచువారు మాకు ఉపకారులై ఉన్నారు'** అన్నారు శ్రీరామదాసు వారు. ఎందుకంటే విమర్శ అనేది మనకు రెండు రకాలుగానూ ఉపకారమే చేస్తుంది. ఒకవేళ వారి విమర్శలో నిజం వుంటే అది మన తప్పులను మనం తెలుసుకొని సరిదిద్దుకోవడానికి, తద్వారా ఉన్నత స్థితికి చేరడానికి ఉపయోగపడుతుంది. అదే ఆ విమర్శలో నిజం లేకుండా కేవలం మనను నొప్పించడానికో, కించపరచడానికో చేసినట్లయితే కూడా మనం దానిని సద్బుద్ధితో స్వీకరిస్తే అది మన దుష్కర్మలను కొంతవరకు రహితం చేస్తుంది. ఎందుకంటే మనం ఎప్పుడైనా శారీరకంగా కానీ మానసికంగా కానీ కష్టాన్ని అనుభవిస్తున్నామంటే ఆ విధంగా మన పాపకర్మల భారాన్ని తగ్గించుకుంటున్నామని గుర్తు పెట్టుకోవాలి. అలాగే మనం అనుభవించే సుఖాలన్నీ మన సత్కర్మల పుణ్యాన్ని హరించివేస్తుంటాయి.

ఇలా రెండు రకాలుగా మనకు మంచే చేస్తుంది కాబట్టే విమర్శ మనకు ఎంతో అవసరం. అందుకే జగన్మాత **'విమర్శరూపిణీ'**. కాబట్టి విమర్శ చేసేవారిని వ్యక్తిగా చూడకుండా ఈ రూపంలో జగన్మాత మనను మంచిదారిలో పెడుతోందనో, లేక మన దుష్కర్మలను హరిస్తోందనో భావించి విమర్శను ఆనందంగా స్వీకరించడం నేర్చుకోవాలి. అలా

స్వీకరించాలంటే ముందు మనం చేసే పనులు, మనమూ ఒకటి కాదని బాగా గుర్తు పెట్టుకోవాలి. ఎవరైనా మన పనిని విమర్శించారంటే అది మనను కాదని గ్రహించి ఆ పనిలో ఉన్న లోపాన్ని సరిదిద్దుకుంటే ఇంకా ఉన్నతంగా పని చేయగలుగుతాం. అసలు ముందు మనం ఆ పని ఎందుకు చేస్తున్నామో అన్న విషయాన్ని సదా గుర్తు పెట్టుకొని ఈ విమర్శ ఆ ప్రయోజనంలో ఒక మెట్టు అని గ్రహించాలి. మనమీద వేసే రాళ్ళతోనే మనం మెట్లు కట్టుకొని ఇంకా ఇంకా పైకెదగాలి.

అలా కాకుండా ఎప్పుడైతే మనం అవతలి వారిని మన మిత్రులుగానో, శత్రువులుగానో, మనకంటే పెద్దవారిగానో, చిన్నవారిగానో చూస్తున్నామో అప్పుడే మనం వారి విమర్శను గ్రహించే విధానంలో లోపం వస్తుంది. అసలు ముందు మనలో ఏదో తప్పు చేశామన్న అపరాధ భావం ఉంటే ఇక ఎవరు మనవైపు చూసినా, వారిలో వారు మాట్లాడుకుంటున్నా వారు మననే విమర్శిస్తున్నారని, మన గురించే చెడుగా మాట్లాడుకుంటున్నారని మనలో స్థిరమైన అభిప్రాయం ఏర్పడిపోతుంది. అందుకని ముందు ఆత్మవిమర్శ చేసుకొని, మన అపరాధాలను సరిదిద్దుకొని, ప్రతి విమర్శలోనూ వ్యక్తిని చూడటం మానేసి జగన్మాతను చూడటం నేర్చుకొంటే ఇక ఆ మనసుకు సదా శాంతే కదా!



# సుమాంజలి

-సూరి. మహాలక్ష్మి

శ్రీ రమణ అన్నయ్య చాలాసార్లు నా వద్దకు వచ్చి, 'అమ్మాయీ! నీవు ఏమైనా వ్రాసి ఇవ్వమ్మా! నీవు వ్రాయలేని పక్షంలో నువ్వు చెబితే నేను వ్రాస్తాను' అన్నారు. నేను వ్రాయడంలో సోమరినని ఒప్పుకుంటాను. ఇలా మరో గురుసోదరులు కూడా బ్రహ్మలీనమైనారు. అన్నయ్యగారి మీద నాకున్న గౌరవ భావనతో వ్రాతపూర్వకమైన నమస్సుమాంజలులు అర్పిస్తూ, వారికీ పుష్పాన్ని సమర్పించుకుంటున్నాను.

శరీరము బంకమట్టితో చేయబడిన ఇల్లు. దీనిని మనం భూదేవి నుండి బదులు తెచ్చుకున్నామన్న సంగతి విజ్ఞులైనవారికి విదితమే! అద్దె కొంపలో వున్న ప్రతి ఒక్కరూ ఖాళీచేసి వెళ్ళిపోవలసినదే. ఇక్కడ శాశ్వతంగా వుంటానంటే కుదరదని ప్రతి జీవికీ తెలుసు. కానీ, ఈ అద్దె కొంపను ఆశ్రయించిన ప్రతి ఒక్కరికీ (జ్ఞానికి తప్ప) దీనిపై విపరీతమైన మమత్వం, దానితోపాటు నేను అనే అహంకారం మిళితమై, మనం జీవన యాత్ర సాగిస్తున్నాము. అలా కాకుండా దేహంపై మమత్వాన్ని, దేహం నేను అనే అహంకారాన్ని త్యజించి, ఆశ్రమంలో జీవనయాత్ర సాగించిన శ్రీ రమణఅన్నయ్య ధన్యజీవులైనారు. వారి నుండి ఆదర్శంగా తీసుకొనవలసిన విషయాలు చాలా వున్నాయి. వారి యొక్క స్థిత ప్రజ్ఞత్వాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. గీతాచార్యుడు చెప్పినట్లు తాను దేహమునందు వున్ననూ, దేహాతీతుడను అని తెలుసుకుని సాక్షిగా జీవించగలిగిన శ్రీ రమణన్నయ్యను ప్రేరణగా తీసుకుని, సోమరినైన నేను కూడా వ్రాయకుండా వుండలేకపోయాను.

గీతాచార్యుడు **యం లబ్ధ్వాచా పరం లాభం మన్యతే నాధికం తతః। యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే॥** దేనిని పొందితే ఇక ఇతర లాభములన్నిటినీ అంత గొప్పగా చూడరో, దేని యందు నిలకడ కలిగితే, ఘోర దుఃఖము సంప్రాప్తించినప్పటికీ ఏమాత్రమూ చలింపడో, అట్టి స్థితిని వర్ణించారు.

ఇది దేహాభిమాన రహితులకే సిద్ధింపగలదు కానీ అన్యులకు కాదు. అట్టి స్థితిని సంపాదించుకుని తరించిన వారు శ్రీరమణన్నయ్య! ఈ సంసార మహార్ణవము దాటాలనుకునే ప్రతి ముముక్షువుకూ శ్రీ

ఆదిశంకర భగవత్పాదాచార్యులవారు ఒక సూచన చేస్తున్నారు. **శరీర పోషణార్థీ సన్య ఆత్మానం దిదృక్షతి గ్రాహం దారు ధియా ధృత్వా నదీం తార్తుం సగచ్ఛతి।** ఒకానొక యాత్రికుడు పాదచారియై తీర్థయాత్రలు చేస్తూ పోతుండగా దారిలో ఒక నది అడ్డువచ్చింది. సూర్యుడు అస్తమించి చీకటి నలుదిశలా వ్యాపించింది. నది ఒడ్డున ఒక పడవ గానీ, మనుష్య సంచారం గాని లేనందున దూరంగా చీకట్లో నల్లటి మొద్దు కనిపించగా, అది కొయ్య అని భ్రమపడి దానిపై కూర్చుని నెమ్మదిగా నదిలోకి ప్రయాణం సాగించాడు. నది మధ్యలోకి వెళ్ళేసరికి ఆకాశంలో మెరుపు మెరసి, అది కొయ్యకాదు మొసలి అని తెలిసింది. ఇట్టి పరిస్థితిలో ఆ యాత్రికుడు ఆవలి ఒడ్డుకు చేరగలడా? అని మనను ప్రశ్నిస్తున్నారు.

చేరలేడు సరికదా! మొసలివాత పడి మరణిస్తాడు. కావున దేహధారియైన ప్రతి ఒక్కరూ సంసార సాగరాన్ని దాటాలంటే అజ్ఞానమనే మొసలివాత పడకుండా వెలుగును దర్శించి, గురుకృపకు పాత్రులై తప్పక తరించే ప్రయత్నంలో వుందుము గాక! శ్రీ సద్గురునాధుని స్మరణలో జీవయాత్ర గడుపుదుము గాక!

శ్రీ రమణన్నయ్యగారిలో గొప్ప విశేషమేమిటంటే, తన తలను ఎప్పుడూ వంచుకునే వుండేవారు. గరిక గడ్డి మనం కాలు పెట్టినప్పుడల్లా వంగి, మళ్ళీ తిరిగి మామూలుగా నిలబడుతుంది. అందుకే దానిని పూజలో వినియోగిస్తాము. అలా గురుబిడ్డ ఎప్పుడూ అన్నీ తెలిసినా నాకేమీ తెలియదనే భావాన్ని పెంపొందించుకోవాలి. ఎప్పుడైతే మన తల వంగి వుంటుందో అప్పుడు ప్రపంచం అంతా మనకు అనుకూలమై వుంటుంది. ఇలా సద్గురు వాక్యములను అకుంఠిత శ్రద్ధతో ఆచరించి, గొప్ప పరిణామమును సాధించిన శ్రీ రమణన్నయ్య ధన్యులైనారు!!

# గోమాత

- సన్నిధానం కాళీమాత

సర్వాంతర్యామి అయిన దేవుడు ఇలలో తాను భౌతికంగా లేని లోటును గోమాతను సృష్టించి పూడ్చుకున్నాడు. ఒక్కొక్క దేవతను పూజిస్తే ఆ దేవత మాత్రమే అనుగ్రహిస్తుంది. కానీ, సకల దేవతలను తన శరీరంలో నింపుకున్న గోమాతను పూజిస్తే, దేవత లందరూ మెచ్చుతారు. గోక్షీరం సరస్వతీ కటాక్షం. బుద్ధిబలం పెంపొందిస్తుంది. విద్యార్థులు ప్రతిరోజూ గోక్షీరం తీసుకోవడం ఎంతో శ్రేయోదాయకం. నిత్యం గోక్షీరం సేవించి, గోమాతకు నమస్కరించడం వలన బుద్ధి బలం, ఆధ్యాత్మిక శక్తి వృద్ధి చెందుతాయి. గోశాలలో చేసిన జపాలు అధిక ఫలం ఇస్తాయి. గోశాల వున్న ప్రాంతం దేవాలయంతో సమానం.



మన పురాణాలలో, వేదాలలో, ఉపనిషత్తులలో గోమాతను పూజించడం వలన కలిగే లాభాలు, భౌతిక ఆధ్యాత్మిక ఉన్నతుల గురించి అనేకములుగా చెప్పబడ్డాయి. అటువంటి వాటిలో అంటే గోపూజ చేయడం వలన పాపాలు పోయి, మనం పొందే వున్నత స్థితి గురించి భవిష్యపురాణంలోని గోమతి కథ ద్వారా తెలుసుకుందాం!

**ఆదిత్యావా గౌః** - దుష్ట శక్తులను దూరం చేయగల సూర్యుని లోని శుక్ల రశ్మి శక్తులను కలిగినది గోవు. మహాభారత యుద్ధంలో ఎంతో మందిని చంపటం జరిగింది. దాని పరిహారం కోసం ధర్మరాజు శ్రీకృష్ణుని అడుగగా, ఆయన ద్వాదశీ వ్రతం చేయడం ద్వారా సర్వ పాప పరిహారం జరుగుతుందని చెబుతాడు. ఈ వ్రతం శుక్లపక్ష ద్వాదశి నాడు చేయాలి. గోమతి అనే ఇల్లాలు తన భర్త అయిన కౌండిన్యుని అనుమతితో ఈ వ్రతం చేసింది. ప్రాతఃకాలంలోనే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం చేసి, సంకల్పం చెప్పుకుని, గోమయంతో ఇల్లు శుభ్రపరచుకుని, ముగ్గులు పెట్టి, పూలతో, బియ్యంతో మండపం

ఏర్పరచుకుని, కలశం పెట్టి, కేశవ పార్వతీ ప్రతిమల నుంచి, 12 విష్ణు ప్రతిమలను, గరుత్మంతుని ప్రతిమను అలంకరించింది. ఆవునేతితో దీపం పెట్టి, విగ్రహములకు షోడశోపచార పూజ చేసి, శ్రీకృష్ణుని ఆరాధించి, కపిలగోవును దూడతో కూడా అన్ని మంగళ ద్రవ్యాలతో పూజించి, ఆ రాత్రి బంధువులతో దీపం దగ్గర జాగరణ చేసింది.

ఆ రాత్రి సమయంలో వెలికే దీపం ప్రమిదలోని ఆవునేతి సువాసనకు ఒక ఎలుక అక్కడకి వచ్చింది. ఆకలి తీర్చుకోవాలని ప్రమిద దగ్గరకు రాగా, అక్కడివారు దాన్ని తరిమికొట్టారు. అందువల్ల అది దూరంగా వెళ్ళి, మళ్ళీ వచ్చి ఆ దీపం వైపే చూస్తూ రాత్రంతా జాగరణ చేసింది. ఇలా అటు భక్తులు, ఇటు ఎలుక కూడా జాగరణ చేయడం జరిగింది. అంతలోనే తెల్లవారడం, సూర్యరశ్మి తన శరీరంపై పడగానే, ఎలుక ఒక అందమైన స్త్రీగా మారిపోయింది. ఆ స్త్రీ గోమతికి నమస్కరించి, 'కృతజ్ఞురాలను అమ్మా! గోమతీ! పూర్వజన్మలో నేను అనేక పాపాలు చేశాను. నా భర్తకు తెలియకుండా చేసిన అనేక పాపాల వల్ల నరకానికి వెళ్ళి నానా బాధలూ పడి, యమ పాశం నుంచి విముక్తి లేక కుక్క, పంది, పిల్లి, కోతి, అనేక క్రిమికీటకాలుగా అనేక జన్మలు ఎత్తి ఈ జన్మలో మీ ఇంట ఎలుకనై పుట్టి, ఈనాటి ద్వాదశీ వ్రత ప్రభావంతో ఉపవాసం, జాగరణ చేయడం వలన సర్వ పాపముల నుండి విముక్తి పొంది, స్వర్గానికి వెళ్ళడానికి నోచుకున్నాను. అదిగో విమానం వచ్చింది! నేను వెళ్ళి వస్తాను' అని చెప్పి అందరూ చూస్తుండగానే విమానంలో వెళ్ళిపోయింది.

మాధవీ అనే పేరుగల ఆ ఎలుక వృత్తాంతం విని, స్వర్గానికి వెడుతున్న ఆమెను చూసి, గోమతి ఆమె బంధువులూ ఆశ్చర్యపోయారు. పునఃపూజ చేసి, ముత్తయిదువులను, బ్రాహ్మణులను సత్కరించారు. ఆ వ్రతం పూర్తి చేసుకుని, అందరూ ఇహలోక, పరలోక సుఖాలను, విష్ణు సాన్నిధ్యాన్ని పొందారు. ఈ వ్రతం చేసిన వారికి తప్పక ఫలితం లభిస్తుంది. వ్రతం చేయకపోయినా శుద్ధ ద్వాదశి నాడు ఆవును, దూడతో సహా పూజించి, గోమతి కథ చెప్పుకుని అక్షింతలు వేసుకుంటే, అంతవరకూ చేసుకున్న పాపాలు పోయి, ఈ వ్రత ఫలితాన్ని పొందుతారు. - (డా॥ నిష్ఠల గోపాలకృష్ణగారు వ్రాసిన గోమాత- అద్భుత శక్తి అనే గ్రంథం నుండి సేకరించ బడింది).

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

## రెండవ అధ్యాయము - సాంఖ్య యోగము

**సంజయ ఉవాచ:**

1. **తం తథా కృపయావిష్టం అశ్రుపూర్ణాకులేక్షణం**
**విషీదంతమిదం వాక్య మువాచ మధుసూదనః ॥**

పరాకృప చేత పూర్తిగా ఆవహించబడినట్లు కన్నీరు కారుస్తూ విచారంతో ధనుర్బాణాలను విసర్జించి చతికిల బడ్డ అర్జునుణ్ణి శ్రీకృష్ణ భగవానుడు చూచాడు. నిజానికి యుద్ధంలో పాండవుల విజయం అర్జునుడి శౌర్య ప్రతాపాల మీద ఎంతో ఆధారపడి ఉంది. యుద్ధంలో ఎంతో ప్రముఖపాత్ర వహించవలసిన అర్జునుడు ఇప్పుడు తాను యుద్ధం



చేయను అని చతికిలపడ్డాడు. కాని శ్రీకృష్ణ భగవానుడు లీలా మానుష విగ్రహుడైన పురుషోత్తముడు కనుక, అర్జునుడి సమస్యను వెంటనే అర్థం చేసుకున్నాడు. ఆయన ఏమీ చలించకుండా అర్జునునితో ఇలా అన్నాడు.

**శ్రీభగవానువాచ:**

2. **కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితం**
**అనార్యజుష్టమస్వర్గ్య మకీర్తికర మర్జున! ॥**

శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! ఇదేమిటి? ఇటువంటి క్లిష్ట సమయంలో నీకీ భ్రాంతి ఎక్కడ నుండి కలిగింది? ఈ మనోవ్యాకులత, ఈ కలవరపాటు ఎక్కడ నుండి దాపురించాయి? ఇది అనార్యులకు మాత్రమే ఉండవలసిన లక్షణం. నీ మనస్సు కలుషితమై, అల్లకల్లోలం అయింది. బురద నీళ్ళలో అడుగు ఎలా కనపడదో, కలుషితమైన నీ మనస్సు అడుగున ఉన్న సత్యం కూడా అలాగే కనిపించదు. నీలో దాగి ఉన్న ఆసక్తి వలన నీ మనస్సు మబ్బులు క్రమ్మినట్లుగా అయి, సరియైన మార్గాన్ని చూడలేకపోతున్నది. నీవు చేద్దాము అనుకుంటున్నది నిన్ను ఇహపరాలకు రెంటికీ దూరం చేస్తుంది. ఇది ఇహంలో నిన్ను శాశ్వతమైన

అపకీర్తి పాలు చేస్తుంది. పరంలో నీకు స్వర్గప్రాప్తి లేకుండా చేస్తుంది" అన్నాడు.

3. **క్లైబ్యం మాస్మ గమః పార్థ! నైతత్త్వ య్యుపపద్య తే**
**క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప! ॥**

శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! శౌర్య ప్రతాపాలతో శత్రువులను హరింపజేయగలిగిన నీకు భ్రాంతి ఏమిటి? పరిస్థితులను ఎదుర్కొనలేక పోవటం అనేది షండత్వమవుతుంది గాని, ఉదాత్తగుణములైన కరుణ కాని, జాలికాని ఎన్నటికీ కాలేదు. ఇది నీకు భ్రాంతి వలన కలిగిన హృదయ దౌర్బల్యమే కాని, వేరేమీ కాదు. ఇది క్షుద్రము అయినది. నీచమైన ఈ పిరికితనాన్ని, హృదయ దౌర్బల్యాన్ని విడిచిపెట్టు. లేచి నిలబడు" అన్నాడు.

శ్రీ కృష్ణ భగవానుడు క్లైబ్యం అన్న పదాన్ని వాడి, అర్జునుడిలోని వీరావేశాన్ని రెచ్చగొడుతున్నాడు. ఊర్వశి శాపం వల్ల అర్జునుడు అజ్ఞాతవాస కాలంలో పేడివానిగా మారి విరాటరాజ తనయకు నాట్యం నేర్పుతూ గడిపాడు. అలా అభ్యాసమైన పేడితనం ఇంకా పోలేదా? ఇంకా నీలో మగతనం మేలుకోలేదా? అని శ్రీకృష్ణ భగవానుడు అర్జునుణ్ణి ఎద్దేవా చేస్తున్నాడు.

యుద్ధానికి భయపడి స్వజనాన్ని చంపవలసి వస్తుంది అనే నెపంతో విషాదమూర్తి అయి చతికిలబడ్డ అర్జునుడు స్వధర్మాన్ని ఆచరించటానికి వెనుదీసే సాధకులందరికి ప్రతీక. ఏదైనా ఒక పెద్ద గడ్డు సమస్య నీముందు నిలబడితే, నీ పరిస్థితి కూడా సరిగ్గా అలాగే ఉంటుంది. నీవు కూడా అప్పుడు సరిగ్గా అలాగే ప్రవర్తిస్తావు. అర్జునుడు క్షత్రియుడు. క్షాత్రం అతని స్వధర్మం. అతడు దానిని ఆచరించటం ముఖ్యం. అలాగే, ఏ వృత్తిలో ఉన్నవాడికైనా, స్వధర్మాచరణం ముఖ్యమైనది. అట్టి స్వధర్మాచరణం చేయనివాడు ధర్మభ్రష్టుడు అవుతాడు. అర్జునుడిని ధర్మభ్రష్టుడు కాకుండా కాపాడటానికే శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! ఇంతటి క్లిష్ట సమయంలో నీకిది ఎలా సంభవించింది? నీ మనస్సు కలుషితమై, విషాద మేఘాలు ఆవరించి, నీకు నీ స్వధర్మం ఏదో తెలియకుండా పోయింది. నీవు ఇప్పుడు మగతనం లేని పేడివానివలె వ్యవహరిస్తున్నావు. నీవు, నీకిప్పుడు వీరందరి

పైన కలిగింది జాలి అనుకుంటున్నావా? అలా అయితే, ఇంతకు ముందు ఎన్నిసార్లు నీవు వీరిలో కొందరితో అయినా యుద్ధం చేయలేదు? అప్పుడు లేని జాలి ఇప్పుడు ఎక్కడ నుండి వచ్చింది? ఇది కేవలం క్షుద్రమైన, నీచమైన హృదయ దౌర్బల్యం తప్పవేరేదీ కాదు. ఇది దుఃఖావేశం వల్ల నీలో కలిగిన బలహీనతే గాని మరేమీ కాదు. దీని నుండి తేరుకొని నీ స్వధర్మాన్ని నిర్వర్తించు" అని బోధించాడు.

శ్రీకృష్ణ భగవానుని ఈ మాటలను విని అర్జునుడు వెంటనే యుద్ధం చేసి ఉంటే, గీతగాని, గీత యొక్క ఆవశ్యకతగాని ఉండేవి కావు. కాని ఆసక్తి చాలా శక్తివంతమైనది. శ్రీకృష్ణ భగవానుని ఆ పరుష వాక్యాలు కూడ, అర్జునుణ్ణి రణోన్ముఖుడినిగా చేయలేకపోయాయి అంటే, ఆ ఆసక్తి ఎంత శక్తివంతమైనదో నీవే ఊహించుకో.

- సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు, ఆశ్రితాశ్రమంలోని శ్రీమతి దేవకోడు సత్యవతి (క్యాంటీన్ బ్రహ్మయ్యగారి భార్య) 8-5-2025 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 82 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు, శ్రీమతి బాపట్ల శివ వెంకట లక్ష్మి 21-4-2025 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 40 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి)

-పాలూరి ప్రసాద్

**21. ఓం గురుశేఖరాయ నమః**

శ్రీ సమర్థ సద్గురు దేవులు ఈ జగత్తులోని గురువులందరిలోకి ఉత్తములు, శ్రేష్ఠులు. జిజ్ఞాసువులై తమను చేరు సాధకులనే కాక ఏమియు తెలియని అజ్ఞానులను, సాధన చేయలేని అల్పులను కూడ ఉద్ధరించి, ముక్తిని ప్రసాదించగల సమర్థ సద్గురువులు.

**22. ఓం తరుణాయ నమః**

తరుణుడు అనగా లేత వయస్సులో ఉన్నవాడు. శ్రీగురుదేవులు ఎప్పుడూ నాకు మైనారిటీ తీరలేదు అనేవారు. 'వృద్ధాః శిష్యాః గురుర్యువా' అన్నట్లుగా వారి శిష్యులు ఎంత వృద్ధులైనప్పటికీ వారు మాత్రం నిత్య యవ్వనులే. దేశకాలాతీతులైన గురుదేవులకు ఏది దేశము? ఏది కాలము?

**23. ఓం విశ్వ సంసేవ్య చరణాయ నమః**

శ్రీ గురుదేవుల దివ్య చరణారవిందములు విశ్వమంతటికీ పూజనీయములు. సేవనీయములు. అవి గంగా మాతకు జన్మనిచ్చిన పవిత్ర చరణాలు. నింగిని నేలను కొలిచిన పవిత్ర చరణాలు. ఒక రాతిని నాతిగా మార్చిన శ్రీచరణాలు. అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే జ్ఞానభాస్కర కిరణాలు. అట్టి శ్రీచరణాలకు నమస్కరించుచున్నాను.

**24. ఓం విశ్వ కారణాయ నమః**

ఈ విశ్వమంతటికీ కారణభూతులు శ్రీగురుదేవులే. వారి యొక్క సంకల్ప మాత్రం చేత ఈ విశ్వం సృష్టించబడుతుంది. వారి దివ్య కరుణారస వృష్టి యందు వృద్ధి పొందుతుంది. తిరిగి వారిలోనే లీనమౌతుంది. త్రిమూర్తి స్వరూపుడైన అట్టి గురుదేవునకు నమస్కరించుచున్నాను.

**25. ఓం గంభీరాయ నమః**

శ్రీ గురుదేవులు ధీర గంభీర మూర్తి. వారిని ఈ లోకంలోని ఏ శక్తులు ప్రభావితం చేయలేవు. కనీసం వారిని తేరిపార చూచుటకు కూడా సాహసించలేవు. వారినే కాదు, వారిని నమ్ముకున్న వారిని కూడ వక్రదృష్టితో చూడటానికి యే శక్తులు సాహసించలేవు. కానీ వారిని ఆశ్రయించిన వారికి మాత్రం వారు నిత్య ప్రసన్నులే.

**26. ఓం గణనారంభాయ నమః**

ప్రళయకాలంలో వటపత్రశాయియై, పునఃసృష్టికోసం పసిబాలునిగా ఆవిర్భవించిన శ్రీగురుదేవులు ఆద్యులు, అగ్రగణ్యులు. వారిని మించిన బంధువు గానీ, స్నేహితుడు గానీ, హితుడు గానీ మనకు మరియొకరు లేరు. అంతేకాక ఏ రంగంలో ఏ ప్రమాణాలతో చూసినా వారే అగ్రగణ్యులు.

**27. ఓం సంభావిత శుభోదయాయ నమః**

శ్రీ గురుదేవులు ధ్యాన సమాధి నిష్ఠ ద్వారా జ్ఞాన జ్యోతిని ఉదయింప జేయు వారు. సంభావిత అనగా ధ్యానము ద్వారా ఉన్నత స్థితిని పొందిన శుభ అనగా ప్రకాశవంతమైన అనగా జ్ఞాన ప్రకాశము కలిగిన ఉదయము కలవారు. శ్రీ గురుదేవులయందు ఏకనిష్ఠులై ధ్యానము చేయుట వలన వారి అనుగ్రహము ద్వారా మనకు కూడా అట్టి జ్ఞానోదయము కలుగును.

**28. ఓం వరేణ్యాయ నమః**

ఈ నామమునకు కూడా అగ్రగణ్యుడు, అందరికంటే శ్రేష్ఠుడైనవాడు అను అర్థములు కలవు. గురు అను శబ్దమునకు గల అనేకార్థములలో పెద్దదైన, గొప్పదైన అను అర్థము కలదు. అనగా గురువు కంటే గొప్పదైన, శ్రేష్ఠమైన వస్తువు ఈ ప్రపంచములో మరేదీ లేదు.

**29. ఓం దీన మందారాయ నమః**

శ్రీ గురుదేవులు దీనులైన శిష్యులను తల్లి వలె వారి కోరికలను తీర్చి వారి ఆధ్యాత్మిక, ఆధి దైవిక, ఆధి భౌతిక తాపములను పోగొట్టి వారిని పరిపూర్ణమైన ఆత్మానందములో ఓలలాడునట్లు చేయు స్వభావము కలవారు. దీనులై తమను చేర వచ్చిన భక్తులు ఎంత అసమర్థులైనను సమర్థ సద్గురు దేవులు వారిని తరింప చేయుదురు.

**30. ఓం కారుణ్యామృత సాగరాయ నమః**

నిస్సీమమైన కరుణ అనే అమృత సాగరమునకు ప్రతీక వంటివారు శ్రీగురుదేవులు. వారి అభయ హస్తం నుండి కరుణపూరిత తరంగాలు సముద్రపుటలలవలె అనంతంగా ప్రవహిస్తూ ఉంటాయి. ఆ అభయహస్తపు నీడలో చేరే ప్రయత్నము చేసినవారు ఇక ఆ అమృత సాగరములో ఓలలాడవలసిందేకాని ఆ సాగరానికి అంతు లేదు. అనగా వారి కరుణా దృష్టి సోకని దేశముగానీ కాలముగానీ లేవు.

- సశేషం

# మలత్రయం

- కీ.శే. పరాశర ప్రసాద్

చక్కర పానకంలో నానబెట్టిన శనగగింజ మధురంగా వుంటుంది. అలాగే వేపరసంలో ఊరబెట్టిన గింజ చేదుగా వుంటుంది. అలాగే మనస్సును బహిర్ముఖంచేసి, ప్రాపంచిక వ్యవహారాలు, రాగద్వేషాలలో, కామక్రోధాది గుణాలలో, ఈర్ష్యా అసూయలతో కాలం వెళ్ళబుచ్చే మానవుడి మనస్సుకి మాలిన్యం అంటకుండా ఉంటుందా! అదే మలము. సాధకుడి మనస్సులో దోషాలు మూడు విధాలుగా వుంటాయి. 1. ఆవరణ దోషము, 2. విక్షేప దోషము, 3. మలదోషము.

తన దేహము, లేక ఉపాధి తానుగా భావన చేసే దోషమే ఆవరణ దోషము. అలా కాకుండా మనస్సు విక్షేపం చెంది, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే పంచతన్మాత్రల ప్రభావం చేత కలిగే దోషాలు విక్షేపదోషాలు. సాధకుడు ఆచరించే కర్మ ద్వారా గాని, ప్రవర్తన ద్వారా గాని, సంక్రమించే ఫలమే మల దోషంగా భావించబడుతుంది. మల దోషం ప్రధానంగా మూడు విధములుగా వుంటుంది.

1. కార్మిక మలము, 2. మాయా మలము, 3. ఆణవ మలము. కార్మిక మలము స్థూల శరీరానికి చెందినది. మానవుడు తెలిసో తెలియకో ఇతర జీవరాశులకు హాని తలపెట్టవచ్చు. దోమలని చంపవచ్చు. లేదా తాను సంచరించినప్పుడు తన పాదాల క్రిందపడి ఏవైనా జీవులు మరణించవచ్చు. తాను తినే ఆహారం ద్వారాగానీ, త్రాగే నీటి ద్వారాగానీ, పీల్చే గాలి ద్వారాగాని ఎన్నో క్రిములకు హాని కలుగవచ్చు. ఈ క్రియల ద్వారా సంక్రమించిన పాప ఫలమే కార్మికమలము. కార్మిక మలదోషం రహితం కావటం చాలా సులభము. సాధకుడు సద్గురు మూర్తి ప్రసాదించిన లక్ష్యార్థమైన మంత్రరాజం యొక్క నిరంతర స్మరణ ద్వారా కార్మిక మలము రహితము అవుతుంది.

మాయా మలము సూక్ష్మ శరీరానికి సంబంధించినది. సాధకుడు తన వాక్కుద్వారా లేక ప్రవర్తన ద్వారా ఇతరుల మనస్సు నొప్పించినా, వారిని ఇతర విధములైన మానసిక, శారీరక బాధలకు గురిచేసినా కర్మని మూటకట్టుకోక తప్పదు కదా! ఆవిధంగా సంక్రమించిన కర్మఫలమే మాయామలము. అది చిత్తములో రికార్డు అవుతుంది. మానవుడు మనస్సుపెట్టి ఆచరించిన దుష్కృత కర్మలు చిత్తములో రికార్డు చేయబడి అవి స్వప్నంలో మనస్సు ద్వారా బహిర్గతమై మానసిక వ్యథకు గురికాక తప్పదు. మాయామలము సంచితార్థముగా

వెంటాడి సాధకుణ్ణి హింసిస్తుంది. స్వప్నానుభవం మెలుకువ వచ్చిన తరువాత ఎలా జ్ఞప్తికి వస్తుందో మాయామలం కూడా సంచితార్థంగా జన్మను తీసుకువచ్చి ఫలాన్ని అనుభవింపజేస్తుంది. శ్రవణం చేసిన గురుబోధను మననం చేయటం ద్వారా అది నిదిధ్యాసకు వచ్చి మాయామలం రహితం అవుతుంది.

ఆణవమలం కారణ శరీరానికి సంబంధించినది. ఇది జన్మజన్మల నుంచి ఆర్జించిన వాసన. సాధకుని మనస్సులో జీర్ణించుకు పోయిన తీరని సంకల్పాలు బీజరూపంలో కారణశరీరంలో దాగి వుంటాయి. అదే వాసన. కారణ శరీరానికి ఆధారము వాసన. అది రహితం కానంతవరకు జన్మ తప్పదు. దేహం తాననే భావనే ఆణవ మలానికి ఆధారము. అది తొలగటం దుర్లభం. అది తొలగాలంటే సద్గురుమూర్తి అనుగ్రహం కావాలి. సద్గురుమూర్తి ఉపదేశించిన '**తత్త్వమసి**' అనే మహావాక్యాన్ని అనుభవించినప్పుడే ఆణవ మలం రహితమవుతుంది.

నిదురించేముందు మానవుడు ఏ భావనతో వుంటాడో మేల్కొన్న తరువాత అదే భావంతో ఉంటాడు కదా! అలాగే దేహాన్ని త్యాగం చేసిన మానవుడు ఏ సంకల్పంతో నిష్క్రమిస్తాడో ఆ సంకల్పాన్ని సాధించటానికి అనువైన పంజరంతో జన్మకి రావటం తప్పనిసరి. అందువలన ఆణవమలం రహితం కానిదే జన్మరాహిత్యం అసాధ్యం.


ప్రేమాస్పదురాలైన తల్లి చెప్పేదాకా తండ్రి ఎవరో తెలియదు. కంటికి కనిపిస్తూ, పోషిస్తున్నప్పటికీ తల్లి చెప్పిన తరువాతే ఆయన తండ్రి అనే విశ్వాసం అంకురిస్తుంది. అప్పుడే ఆయన పట్ల గౌరవాన్ని, భయ భక్తులను వ్యక్తం చేయడం మొదలవుతుంది. తల్లి చెప్పకపోతే తండ్రి ఎవరో ఎలా తెలుస్తుంది? కంటికి కనిపించే తండ్రి గురించి తల్లి చెబితే గాని యదార్థ జ్ఞానం కలుగదు. అటువంటప్పుడు కనులకు కానరాని లోకజనకుడు, సృష్టికర్త, సర్వవ్యాపియైన ఆ పరమాత్మ గురించి అసలైన జ్ఞానాన్ని మనకు ఎవరు అందిస్తారు? ఇంకెవరు?? చీకటి నుంచి వెలుగు వైపుకు నడిపించే సద్గురువే మనకు భగవత్సంబంధమైన జ్ఞానాన్ని సుబోధకం చేస్తాడు.

- శ్రీ బాబూజీ మహరాజ్

# సతి-శివుడు

- కీ.శే. రమణ ప్రసాద్

శివ శక్తి - ప్రకృతి శక్తుల కలయిక వల్లనే సృష్టి, స్థితి లయాలు జరుగుతున్నాయి. దానిని తెలిపేదే శివుడు సతిని పరిణయమాడిన గాథ.



బ్రహ్మ సృష్టి కార్యక్రమం జరగటం కోసం పది మంది మానస పుత్రులను సృష్టించాడు. ఆ మానస పుత్రులలోని వారు శివుడు, దక్షుడు. శివుడు తనకన్నా శక్తిమంతుడు కావటం గిట్టని దక్షుడు అతడిని తన శత్రువుగా చూశాడు.

దక్షునికి ప్రసూతికి పుట్టిన పుత్రికయే సతి. ఆమెకు వారు "గౌరి" అని పేరు పెట్టారు. గౌరి (సతి) శివ భక్తురాలు. సౌందర్యవతి, సుగుణవతి. ఆమె ఎప్పుడూ శివుని గురించే ఆలోచించేది. ఆయన గురించే కలలు కనేది. ఆయననే తన భర్తగా నిర్ధారించుకొంది. ఆమె సర్వ దేవతల దీవెనలను పొంది శివుడినే తన భర్తగా పొందాలని కఠిన తపస్సు చేసింది. ఆమె తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమైనాడు. సతీదేవి నమస్కరించి ఆయనను ఎంతో స్తుతించింది. శివుడు ఆమె భక్తికి మెచ్చి వరం కోరుకోమన్నాడు. ఆమె తననే భర్తగా కోరుకుంటుందని తెలుసు. అయినా ఆమె నోట వినాలనుకొన్నాడు.

సతి సంకోచంతో," నాకు ఆయనే భర్తగా కావాలని ఎలా అడగను?" అనుకుని మౌనంగా ఉండిపోయింది. కొంత ధైర్యం తెచ్చుకొని, "స్వామీ! మీరు నన్ను..." అని ఆమె మాటలు పూర్తి కాకుండానే, "నిన్ను నా భార్యగా స్వీకరిస్తున్నాను" అన్నాడు శివుడు. ఆ తర్వాత శివుడు సర్వ దేవీ దేవతల సమక్షంలో ఆమెను వివాహం చేసికొన్నాడు. వివాహానంతరం ఆమెను తనతో కైలాసానికి తీసుకొని వెళ్ళాడు. కైలాసంలో వారు ఆనందంగా కాలం గడుపుతున్నారు.

ఒకనాడు శివుడు సతీదేవితో "దేవీ! ప్రయాగలో జరుగుతున్న యజ్ఞానికి నాతో నువ్వు వస్తావా? అని అడిగాడు. శివుడు యజ్ఞశాలలోకి ప్రవేశించగానే అందరూ లేచి నుంచున్నారు. కొంతసేపటికి దక్షుడు ప్రవేశించాడు. శివుడు తప్ప అందరూ లేచి నుంచున్నారు. దక్షుడు అది

తనకి అవమానంగా భావించాడు. "నా అల్లుడు నన్ను చూసి లేచి నుంచోలేదు. నలుగురిలో నాకు అవమానం జరిగింద"ని అనుకొన్నాడు. శివుడు, "నేను లేచి నుంచొని ఉంటే అది అతనికి హాని కలిగించి వుండేది" అని తను లేవలేదు.

అప్పటినుంచి శివుడిని అందరిలో అవమానం పాలు చేయటమే తన ధ్యేయంగా పెట్టుకొన్నాడు. వెంటనే ఒక పెద్ద యజ్ఞాన్ని తలపెట్టి, శివుడిని తప్ప అందరు దేవతలను ఆహ్వానించాడు. దేవతలందరూ ఆ యజ్ఞానికి తండోపతండాలుగా వెళ్తుంటే, "వాళ్ళు ఎక్కడికి వెళ్తున్నారు?" అని అడిగింది. "వారందరూ మీ తండ్రి చేస్తున్న యజ్ఞానికి వెళ్తున్నారు" అన్నాడు శివుడు. "మరి మిమ్మల్ని ఎందుకు పిలవ లేదు? మిమ్మల్ని అందరికంటె ముందుగా పిలవాలి కదా!" అని అడిగింది కోపంగా. "దక్షుడు నా పైన కోపం పెట్టుకొన్నాడు. అందుకు పిలవలేదు" అన్నాడు. "మీరు అనంత శక్తి సంపన్నులని, మిమ్మల్ని మించినవారు లోకంలో లేరని నా తండ్రికి తెలియదా?" "నువ్వు అన్నది నిజమే. కాని దక్షుడు నన్ను శత్రువుగా చూస్తాడు." "మనల్ని పిలిచినా పిలవకపోయినా మనం వెళ్ళాల్సిందే. ఇది నా తండ్రి తలపెట్టిన యజ్ఞం. నా తండ్రి ఇంటికి వెళ్ళటానికి నాకు ఏ ఆహ్వానం అవసరం లేదు." అన్నది.

"సరే! వెళ్ళు. నీకు నా ఆశీస్సులు. దక్షుడు నన్ను దూషించినా నువ్వు మౌనంగా ఉండు. తిరిగి ప్రతిఘటించకు. ఆ దూషణలు భరించ లేకపోతే నీకు అపకారం జరగవచ్చు" అన్నాడు శివుడు. శివుని వాహనమైన నందిని అధిష్టించి సతీదేవి యజ్ఞ వాటిక చేరుకొంది. దక్షుడు ఇష్టం లేకపోయినా ఆమెను లోనికి రానిచ్చి, అందరిముందూ శివుడిని దూషించటం ప్రారంభించాడు. 'శివుడు పిశాచాల మధ్య తిరుగుతూ ఉంటాడు. శ్మశానమే అతని నివాసం. ఎప్పుడూ బూడిద పూసుకుని ఉంటాడు. అతడికి ఈ యజ్ఞానికి వచ్చే అర్హత ఎక్కడిదీ!" అని దూషణలు చేస్తుంటే తండ్రిని ఆపటానికి ప్రయత్నించింది.

అతడు ఆగకుండా ఇంకా ఇలా అన్నాడు- "అతడు ధరించేది జంతు చర్మం. పాములు అతని ఆభరణాలు. ఎక్కడికి వచ్చినా వెర్రిగా తాండవం చేస్తాడ'ని దూషిస్తుంటే సతీదేవి భరించలేకపోయింది. తనతో "నీ తండ్రి నన్ను దూషించినా నువ్వు భరించు" అన్న శివుని మాటలు

గుర్తుకొచ్చి మౌనంగా ఉండిపోయింది. ఆమె దక్షునితో ఇలా అంది, “నీ కుమార్తెను అని చెప్పుకోవటానికి నాకు సిగ్గుగా ఉన్నది. నా భర్తకు ఇచ్చిన మాట ప్రకారం నేను నీకు ఎట్టి హాని తలపెట్టటం లేదు. నేను ఈ యాగ కుండంలో దూకి ప్రాణ త్యాగం చేస్తాను. వచ్చే జన్మలో నన్ను గౌరవించే తండ్రికి పుడతాను” అని అంటూ యోగాగ్నిలో దూకింది. దక్షుడు ఏమీ జరగనట్లే ఉండి, ఋత్విక్కులను యజ్ఞం కొనసాగించమన్నాడు.

నంది ద్వారా సతీదేవి మరణవార్త చేరగానే శివుడు తన జటాజూటం లోని జడను పీకి నేలమీద రపీమని కొడితే వీరభద్రుడు ఉద్భవించి తన సేనతో వెళ్ళి దక్షుడిని, అక్కడ యజ్ఞం చేస్తున్నవారిని పరిమార్చి యజ్ఞాన్ని చెల్లాచెదురు చేశాడు. దక్షుడి తల ఖండించాడు. అందరూ భయంతో శివుని శరణు వేడారు. శివుడు ప్రపంచాన్నే నాశనం చేయటానికి పూనుకొన్నాడు. అప్పుడు బ్రహ్మాదులు అతనిని శాంత పరచి మరణించిన వారిని బ్రతికించమని వేడారు. శివుడు వారినందరినీ బ్రతికించాడు. దయాళువైన శివుడు దక్షునికి గొఱ్ఱెతల అతికించి అతడిని బ్రతికించాడు. దక్షుడు శివుని కాళ్ళపై పడి క్షమాభిక్ష వేడాడు. శివ భక్తుడుగా మారాడు.

శివుడు దుఃఖంతో గౌరిని తన భుజాలపైన పెట్టుకుని పరిగెడుతుంటే, దేవతలు విష్ణుమూర్తిని ప్రార్థించగా, విష్ణువు శివుడిని శాంత పరచటానికి గౌరి శరీరాన్ని 51 ఖండాలుగా చేశాడు. అవి పడిన ప్రదేశాలు ఉత్తరోత్తరా శక్తి పీఠాలుగా ప్రసిద్ధి పొందాయి.


శివుడు సతీవియోగాన్ని దిగమ్రింగి కఠోర తపస్సు చేస్తూ హిమరాజు కుమార్తె పార్వతిగా పుట్టేవరకు ఉండిపోయాడు. సతి హిమవంతుడికి పుత్రికగా పుట్టింది. ఆమెకు పార్వతి అని పేరు పెట్టారు. ఆమె శివుని కొరకు కఠోరమైన తపస్సు చేసి శివుని భర్తగా పొందింది. ఆ శివ శక్తుల కలయికే శివుని అర్థ నారీశ్వరుని ఆవిర్భావం.

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

ద్వితీయ ఖండము–

ప్రథమ ఖండములోని 33 సూత్రములలో నారద మహర్షి పరాభక్తి స్వరూపమును మహాత్మ్యమును వివరించి అది ఎప్పటికీ పరిపూర్ణమైన సచ్చిదానందమై, అనుభవైకవేద్యమై వుంటుందని వివరిస్తారు. ఈ ద్వితీయ ఖండములో ఆ పరాభక్తిని సిద్ధించుకోవడానికి ఎటువంటి సాధనములను వుపయోగించవచ్చునో, సాధకులు ఎటువంటి చిత్తశుద్ధి కలిగి ఉండాలో నారదుల వారు వివరిస్తున్నారు.



భక్తి సూత్రము 34: **తస్య సాధనాని గాయంతి ఆచార్యాః**

తాత్పర్యము: ఆచార్య పురుషులు పరాభక్తి యొక్క సాధనములను గానముతో కీర్తించారు.

ఇక్కడ నారదుల వారు "నేను చెప్తున్నాను" అన్న భావన లేకుండా "ఆచార్యులు వివరిస్తున్నారు" అని సెలవిస్తూ మహాత్ములచే ప్రతిపాదింపబడిన అంశాలను తెలిపారు. ఆచార్యులనగా స్వానుభవము కలవారు తప్ప వాచా వేదాంతమును బోధించని వారు అని గ్రహించాలి. గీతాచార్యులు "**లోక సంగ్రహమేవాపి**" అని కర్మ యోగములో చెప్పినది కూడా ఈ ఆచార్యవర్యులకే వర్తిస్తుంది. ఈ సూత్రము ద్వారా నారదులు అటువంటి అనుభవజ్ఞులైన ఆచార్యులను మాత్రమే నమ్మాలి కానీ, వాచా వేదాంతులు, లేక మిథ్యాచారులను నమ్మరాదని తెలియజేస్తున్నారు. అలాంటి ఆచార్యులు శంకర భగవత్పాదుల వారు సెలవిచ్చినట్లు "**స్వయంతీర్ణాః పరాం తారయంతి**" అన్న విధముగా తాము తరించి ఇతరులను కూడా తరింప చేయగలరు. పరాభక్తి గురించి ఆచార్యులు "గాయంతి" అంటూ "కీర్తిస్తారు" అనడం ద్వారా ఆ సాధనములను గ్రహించే సాధకుల తన్మయభావమును నారదులు ప్రస్తావిస్తున్నారు.

ఆచార్యులు కీర్తించే పరాభక్తి సాధనములు ప్రాథమికంగా రెండు రకాలు. మొదటి రకమైన వ్యతిరేక సాధనములు పరమాత్మను చేరడానికి బంధనములైన వాటిని తొలగించుకోవడానికి ఉపయోగపడతాయి. వీటిని సాధకులు త్యాగం చేయవలసి వుంటుంది. రెండవ రకమైన అన్వయ సాధనములు పరమాత్మను పొందడానికి ఒక్కొక్క మెట్టుని పైకి ఎక్కిస్తూ దోహదపడతాయి. ఈ సాధనములను ప్రయత్న పూర్వకముగా ఆచరణలో పెట్టవలసి ఉంటుంది. నిజమైన సాధకుడు వ్యతిరేక మరియు అన్వయ

సాధనములు రెండింటి సహాయముతో పరమాత్మను చేరగలుగుతాడు. పరమ గురువులను ఆశ్రయించిన శిష్యుల విషయములో కూడా ఇదే మనకు కనిపిస్తుంది. తన గురువునకు ఇష్టము లేని దానిని త్యజించి తన గురువు బోధించిన వాటివై మక్కువ పెంచుకొనడమే నిజమైన శిష్యుడు యొక్క లక్షణము.

భక్తి సూత్రము 35: **తత్తు విషయ త్యాగాత్ సంగ త్యాగాత్ చ**

తాత్పర్యము: విషయ త్యాగముల మరియు సంగ త్యాగముల వలననే పరాభక్తి సిద్ధిస్తుంది.

ఈ సూత్రము ద్వారా విషయ త్యాగమును మరియు సంగత్యాగమును చేయుట పరాభక్తికి ముఖ్య సాధనములని వివరిస్తారు. ముందు సూత్రములో తెలుపబడిన మొదటి రకమైన వ్యతిరేక సాధనముల గురించి ఈ సూత్రము వివరిస్తోంది. దృశ్య ప్రపంచంలో విషయముల వలే సత్యముగా భాసించే వాటిని త్యాగము చేయడము విషయ త్యాగమని, ఆ దృశ్య ప్రపంచం యెడల ఉన్న మమకారము వదలుట సంగత్యాగమని గ్రహించాలి.

అశాశ్వతమైన లౌకిక ఆనందమును నిరసించి శాశ్వతమైన బ్రహ్మానందమును గురించి విచారణ ద్వారా ఆలోచించడమే విషయ త్యాగము అని పిలవబడుతుంది. అంతే తప్ప బలవంతముగా ఇంద్రియములను నిగ్రహించడం విషయ త్యాగమని పిలువబడదని మహాత్ములు తెలియజేశారు. విషయముల వలన కలిగే ప్రీతి మిథ్యయే తప్ప సత్యము కాదని గ్రహించడమే నిజమైన విషయ త్యాగమవుతుంది. ఈ త్యాగము బుద్ధిపూర్వకముగానే చేయాలి గానీ బలవంతముగా చేయరాదు. పరాభక్తి సిద్ధించిన వారికి లోకంలో చరించినప్పటికీ విషయాకర్షణ ఉండదు.

ఒక వస్తువు యెడల సంగ త్యాగం అంటే వస్తువును తాకకుండా ఉండడమని కాక, దానిమీద వున్న కోరికను వదలుట అని చెప్పబడింది. ఇది బాహ్యాపరమైన వ్యవహారం కాక మానసికమైనదని గుర్తించాలి. దీని గురించే గీతాచార్యులు కర్మ యోగములో **యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేఽ ర్జున। కర్మేంద్రియైః కర్మయోగ మసక్తః స విశిష్యతే ॥** – అంటూ ఇంద్రియములను నియంత్రించి కర్మ యోగము ద్వారా సంగ త్యాగము చేయవచ్చని వివరించారు. సంగ త్యాగము అంతర త్యాగముగా పిలువ బడుతుంది. ఇంద్రియములకు అధిష్టానమైన మనసు త్యాగం చేసినప్పుడు బాహ్య త్యాగము కూడా సులభం అవుతుంది.

**"త్యాగేనైకే అమృతత్వ మానశుః"** అన్న గొప్ప వాక్యము విషయ త్యాగము మరియు సంగ త్యాగములకు ప్రమాణము.

భక్తి సూత్రము 36: **అవ్యావృత భజనాత్**

తాత్పర్యము: (పరా భక్తి) నిర్విరామమైన భజన చేత మాత్రమే సంభవము.

ముందు సూత్రములో తెలుపబడిన విషయ సంగ త్యాగములు సమస్త కళ్యాణ గుణాకారుడైన పరమాత్ముని యొక్క నిర్విరామమైన భజన చేత మాత్రమే సాధ్యమని నారదులు ఈ సూత్రము ద్వారా తెలియజేస్తున్నారు. త్యాగము చేయడానికి కావలసిన మనోబలము కేవలం సత్వ గుణ అభివృద్ధి వలన మాత్రమే సిద్ధిస్తుంది. దీనిని గీతాచార్యుల వారు దైవీ సంపదగా భగవద్గీతలో ప్రస్తావించారు.

భజన అంటే నమ్మిన పాదమును ఆశ్రయించడమే. అవ్యావృత భజన అంటే చెక్కుచెదరని విశ్వాసము, నమ్మిక కలిగి క్రమము తప్పకుండా సాధన చేయడము. అది నిర్మలమైన, నిష్కపటమైన నిర్విరామమైన భక్తికి మూలం. పతంజలి యోగ సూత్రములలో సాధన దీర్ఘకాలము మరియు నిరంతరము అభ్యసించవలసినదని వివరింపబడింది.

శ్రీ బాబూజీ మహరాజ్ వారు సాధకుడికి ధ్యానములో మనసు నిలువనపుడు నిరుత్సాహ పడకూడదని దృఢ నిశ్చయంతో ప్రయత్నించాలనీ, కొలికి పూసకోసం ఎదురు చూడక నామమును తైలధార వలే నిర్విరామంగా కొనసాగించాలనీ బోధించారు. నారదులు వివరించిన అవ్యావృత భజన దానినే సూచిస్తుంది.

గీతాచార్యులు – "**అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః। తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః॥**" – అంటూ "నాయందే మనసు నిలిపి నిత్యము నన్ను స్మరించే వారు నన్ను సులభంగా చేరుతారు" అని సెలవిస్తారు. అదే సాధకులకు అనన్యమైన భక్తిగా పరిణమిస్తుందని ఈ సూత్రము ద్వారా నారదులు వివరిస్తున్నారు.

**పెదనింద్రకాలను శాఖలో కార్యక్రమాలు**

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**జూన్ 2025**

1 బుధ: జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

20 శుక్ర: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

**జులై 2025**

6 ఆది: తొలి ఏకాదశి - శ్రీ సద్గురు పాదపూజ.

10 గురు: ఆషాఢ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

20 ఆది: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**జూన్ 2025**

4 బుధ: జ్యేష్ఠ శుద్ధ నవమి - శ్రీ సుగుణ ప్రసాద మాతాజీవారి అష్టాదశ వార్షికారాధన. సత్సంగం.

11 బుధ: జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

20 శుక్ర: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

23 సోమ: మాసశివరాత్రి

25 బుధ: అమావాస్య

**జులై 2025**

6 ఆది: తొలి ఏకాదశి - ఏకాహం సంకీర్తన, శ్రీ సద్గురు పాదపూజ.

10 గురు: ఆషాఢ పూర్ణిమ - గురుపూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

16 బుధ: కర్కాటక సంక్రమణం - దక్షిణాయన పుణ్యకాల ప్రారంభం

20 ఆది: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

23 బుధ: మాసశివరాత్రి

24 గురు: అమావాస్య

27 ఆది: శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

**చిత్తచలతి సంసారో, నిశ్చలే మోక్ష ఉచ్యతే! మనశ్చాంచల్యమే సమస్త సంసార బంధాలకు మూలము. నిర్మలమైన మనస్సును పరమాత్మ యందే స్థిరపరచుకోవడం అత్యంతావశ్యకము. మనస్సు నిలకడగా వున్నప్పుడే మోక్షాన్ని సాధించుకోవడం సాధ్యమవుతుంది.**

- శ్రీ బాబూజీ మహరాజ్

# తర్కము-తాత్వికత

- పెనుమాక నాగేశ్వర రావు

తర్కానికి, తాత్వికతకు పొంతన కుదరదు. తర్కం ఉన్నచోట దేవుడు ఉండడు. దేవుడు ఉండే చోట తర్కానికి తావు ఉండదు. ఇది నిజం. మామూలు మాటల్లో చెప్పాలంటే మన జీవితంలో ఓ అనుకోని సంఘటన జరిగింది. అది మంచిదీ కావచ్చు, చెడు సంఘటనా కావచ్చు. ఆ సంఘటన జరిగినప్పుడు మనకి ఒక తీర్పు కావాలి. ఆ తీర్పు మనకి అనుకూలంగా ఉండాలనేగా ఎవరైనా కోరుకునేది. ఆ తీర్పరి ఫలానా వ్యక్తి అయితే మనకి అనుకూలంగా ఉండేది అని మన గట్టి నమ్మకం. కానీ ఆ సమయంలో ఆ సదరు వ్యక్తి అందుబాటులో లేడు. అక్కడున్న వారిలో మన అభిమానులు ఉంటారు. అది వేరే విషయం.

తీర్పు ఇవ్వటం జరుగుతుంది. ఇంతకన్నా ఎవరైనా ఏం చేస్తారని మనకూ అనిపిస్తుంది, కానీ ఎలాగైనా ఆ మనిషి ఉండివుంటే బాగుండేది అనే మన ఫీలింగ్ అలాగే ఉండిపోతుంది. సాక్షాత్తు భగవంతుడే ఉన్నా ఇంతకన్నా మంచి తీర్పు ఇవ్వలేడు అని అందరూ ముక్తకంఠంతో చెబుతారు, మనకూ అవుననే అనిపిస్తుంది. అంతలోనే, ఎంతైనా ఆ మనిషి ఉండివుంటే వేరేగా ఉండేది అనే మనకి అనిపిస్తుంది. మన మనసుని సమాధానపరుచునే ప్రయత్నం చేస్తున్నా అదిగో ఆ ఫీలింగ్ పోదు. మనసులో గునుపుగానే ఉంటుంది.. ఇది తర్కానికి అందదు.

అంతదాకా ఎందుకు? నోరు ఇచ్చాడు, మాట ఇచ్చాడు. మౌనానికి మించిన సాధన లేదంటాడు. కళ్ళు ఇచ్చాడు. కంటి చూపు ఇచ్చాడు. ఆయన సృష్టించిన ఈ చరాచర జగత్తుని చూసి మోసపోవద్దు, మోహంలో పడిపోవద్దు అంటాడు. ఆయన దివ్య మంగళ రూపాన్ని అందరికీ చూపించడు. ఏమిటి ఇదంతా? కష్టాలు కలిగించటం నీ మంచికే అంటాడు. అనుభవాలే ఉపాధ్యాయులు అంటాడు. ఆయన్ని తప్ప ఎవ్వర్నీ నమ్మవద్దు అంటాడు. పైగా నిన్ను నీవే నమ్మవు, ఇంకెవరిని నమ్మగలవు అని మనల్నే ప్రశ్నిస్తాడు. దేవుడు ఎక్కడో లేదు. నీలోనే ఉన్నాడు అని చెబుతాడు. ఇంకా మాట్లాడితే నువ్వే దేవుడివి అని కూడా చెబుతాడు.

**ఇందుకలడు, అందు లేడని సందేహము వలదు, చక్రిసర్వోపగతుండు** అని చెప్పి, అంతలోనే **కలడు, కలండనువాడు కలడో, లేడో!** అని సంశయంలో

పడేశారు పెద్దలు. అంతటితో అయిపోలా! **వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించిన వెంకటేశ సమో దేవో నభూతో న భవిష్యతి** - బ్రహ్మాండములలో వేంకటాచల క్షేత్రానికి సమానమైన పుణ్యస్థలం లేనేలేదని, అలాగే ఆ దివ్య క్షేత్రంపై వెలిసి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామికి సాటి రాగల దేవుడు ఇటు భూత కాలంలోనూ అటు భవిష్యత్తు కాలంలోనూ ఉండబోడని అర్థం. ఓం నమో శ్రీ వేంకటేశాయ.

**చక్కెరమాని వేము దినజాలినకైవడి మానవాధముల్**
**పెక్కురు బక్కదైవముల వేమఱుగొల్చెదరట్లు కాదయా**
**మ్రొక్కిన నీకు మ్రొక్కవలె మోక్షమొసంగిన నీవ యీవలెం**
**దక్కిన మాటలేమిటికి దాశరథీ కరుణాపయోనిధీ!**

హీనులనేకులు నిన్ను విడిచి ఇంకొకరిని గొలిచెదరు. అనగా తియ్యని చక్కెరను తినలేక చేదు వస్తువగు వేపను తినుటకు నేర్చినట్లున్నది. మ్రొక్క దగినవాడవు నీవే , మోక్షదాయకుడవు నీవే! అని రాముడిని గురించి చెబుతాడు కంచర్ల గోపన్న.

దేవతలు కూడా చూడాలని తపించే ఈ రూపదర్శనం తేలిక కాదు. వేదాలు చదివినా, దానాలు, పూజలు, తపస్సు చేసినా ఈ రూప దర్శనం కలుగదు. అనన్యభక్తితో మాత్రమే సాధ్యం అవుతుంది. నా కొరకే కర్మలు చేస్తూ, నన్నే నమ్మి, నా యందు భక్తి కల్గి విశ్వంలో నిస్సంగుడైన వాడు మాత్రమే నన్ను పొందగలడు. అని సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్మయే స్వయంగా చెప్పాడు.

మనం ఒక్కొక వారాన్ని ఒక్కో దేవుడికి కేటాయించి, ఒక్కో మాసాన్ని ఒక్కో దేవుడికో, దేవతకో కేటాయించి, ఎప్పటికెయ్యది ప్రస్తుతమో, అన్న చందాన మసలుకొంటుంటాం. మనం చాలా తెలివిగలవాళ్లం అనుకొంటుంటాం. అయితే, ముక్కోటి దేవతలు ఒక్కటైనారు, చక్కన్ని బాబుగా ఇక్కడున్నారు. అనుకుంటూ మనకి కనిపించిన, వినిపించిన, మనల్ని పెంచిన, మనలో భక్తిని పెంచిన మన బాబుని, సద్గురుదేవుని మనసా వాచా కర్మణా ప్రార్థించటం మినహా మనం చేసేది, చేయగలిగింది, చేయాల్సింది ఏముంది? అంతకుమించి కావలసింది ఏముంది? గురువుపట్ల పూర్తి భక్తివిశ్వాసాలతో ఉన్న శిష్యులు ముక్తిని, ఉత్తమ గతులను పొందడం తథ్యం. శిష్యుడు ముక్తి

పొందేవరకు ఆయనే గురువుగా వివిధ జన్మలలోనూ కొనసాగుతారు అని మహాపురుషుల వాక్కు. ఇదే విషయాన్ని మన లలితానంద సరస్వతి స్వాముల వారు సాక్షాత్తు శ్రీ బాబుతోనే చెప్పటం మనం ప్రత్యక్షంగా విన్నాం. ఇంత పెద్ద విషయాన్ని మన గురుదేవులు శ్రీ బాబు మనకి అర్థం అయ్యేలా చిన్న చిన్న మాటల్లో, **నమ్మినవారికి బంగారు పిచ్చుక, నమ్మకపోతే బూడిదే** అనిచెప్పారు గదా. అందుకే ఏ జన్మలో చేసుకున్నా పుణ్యమో ఆ మహానుభావుని ఆశ్రయం దొరికింది. దానిని అలా పవిత్రంగా కాపాడుకుంటూ, ఆయన్నే శరణు వేడుకుంటూ ఉండటం కన్నా మనం చేయవలసిన గొప్ప సాధనలు ఏముంటాయి?

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**జూన్ 2025**

11 బుధ: జ్యేష్ఠ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

20 శుక్ర: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**జులై 2025**

6 ఆది: తొలి ఏకాదశి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

10 గురు: ఆషాఢ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

20 ఆది: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

"అచ్చటనుండి ఆవలి ఒడ్డుకు వెళ్ళి, ఒక మాసకాలము తపస్సుగా భావించి, సీతాదేవిని వెదకండి. విజయముతో తిరిగి రండి!" అని ఆజ్ఞాపించాడు వానరరాజు సుగ్రీవుడు. వారందరూ రామునికి నమస్కరించి, ఆతని ఆశీర్వాదము పొంది తమకు అప్పజెప్పిన కార్యమునకు సన్నద్ధులైనారు. కొన్ని దినముల తరువాత ఉత్తర, తూర్పు, పడమర దిక్కులకు వెడలిన సేన తమకు సీత ఆచూకి ఎక్కడా కానరాలేదని చెప్పి రిక్తహస్తులై వెనుదిరిగారు.

రాముని మనసుకు మాత్రం "హనుమంతుడు తప్పక విజయం పొందుతాడ"ను భావము కలుగుటచే, తనకూ సీతకూ మాత్రమే తెలిసిన కొన్ని విషయములను హనుమంతునికి చెప్పి, తన అంగుళీయకమును కూడ సీతకు ఇవ్వమని చెప్పి ఇచ్చాడు. "ఈ చిహ్నములతో సీతకు నీపై విశ్వాసం కలుగుతుంది" అని తెలిపాడు.

దక్షిణ దిశకు వెళ్ళిన వానరులు పలు అడవులు, కొండలందు సీతను వెదకి, ఆకలి దప్పికలకు గురగుటచే, ఒక గుహకు చేరుకున్నారు. గుహలో అడుగిడిన వారికి చల్లని గాలి వీచింది. అక్కడ వారికి అందమైన ఒక నగరమే కనబడింది. పలు విధముల పండ్లతో నిండిన చెట్లు కనబడ్డాయి. కాని ఎట్టి మానుష సంచారమూ కానరాలేదు. వీటన్నింటి నడుమ ఒక దేవకన్య కనబడింది. ఆమె వారినందరి వైపు ఆగ్రహముతో కూడినదై చూసింది.

హనుమంతుడు ఆమె ముంగిట నిలిచి, "అమ్మా! తమరెవరు? అధ్వాన్నంగా ఉన్న ఈ స్థలమందు ఏమి చేయుచున్నారు?" అని ప్రశ్నించాడు.

"మొదట నీవెవరవు?" అని ప్రశ్నించింది ఆమె. "లోనికి వచ్చుటకు భయమును గొల్పించు ఈ గుహలోనికి మీరెలావచ్చరు?" "ఇక్కడకు వచ్చినవారెవరూ బయటకు తిరిగి వెళ్ళలేరని మీకు తెలియదా!?" అని ప్రశ్నించింది.

"అమ్మా! ఆగ్రహించవలదు. మేము వానర రాజు సుగ్రీవుని ఆనతి మేరకు ఆతని స్నేహితుడైన రాముని ధర్మపత్నియైన సీతాదేవిని వెదుకుచూ ఇచ్చోటకు వచ్చాము. ఆమె అసురుడైన రావణునిచే అపహరింపబడింది" అన్నాడు హనుమంతుడు.

'రాముడు' అన్న పదమును వినిన వెంటనే ఆమె మోము పద్మమువలె వికసించింది. "వానరులారా! రమ్ము! రమ్ము! మీకొరకే నేను నిరీక్షించుచున్నాను" అని బదులిచ్చి " మొదట మీరు, మీ ఆకలిదప్పికలను తీర్చుకొనుము" అన్నది ఆ స్త్రీ. పిదప ఆమె తన కథను వివరించ నారంభించింది.

"నాపేరు స్వయంప్రభ. నేను ఇంద్రలోకమునకు చెందినదానిని. నా చెలికత్తె హేమ అసుర కులమునకు చెందిన మయుడనబడు నగర నిర్మాణకర్త ఒకరినొకరు ఇష్టపడి ఈ గుహలో పలు దినములు ఆనందముగ గడిపారు. వారికి కాపలా నిమిత్తమై నేను ఇక్కడ వుండేదానిని. కనిపించకుండా పోయిన మమ్ములను వెదకుచూ వచ్చిన ఇంద్రుడు ఆగ్రహించి, ఆ అసురుని సంహరించి, హేమను చూసి, "నీవెందులకు మన లోకధర్మమును ఉల్లంఘించావు?" అని ప్రశ్నించగ, ఆమె దానికి నాపై కుట్ర అభియోగం వేసింది. అందులకు ఇంద్రుడు, "ఈమెకు సహకరించి, తగని కార్యము చేసినందులకు నీవు ఈ బిల నగరమందే ఒంటరితనముతో జీవించెదవుగాక!" అని శపించాడు. శాపవిమోచనము కోరిన నాకు, ఆతడు "వానర వీరులు రాముని భార్య సీతను వెదకుచూ ఒక రోజు ఈ గుహలోనికి అడుగిడి, బయటకు వెళ్ళలేక కష్టపడు సమయమున నీవు వారికి సహకరించు. అప్పుడే నీవు తిరిగి మా లోకమునకు వచ్చెదవు" అని శాపనివారణోపాయము తెలిపాడు. అప్పటినుండి నేను మీ రాక కొరకు ఇచ్చోటనే వేచియున్నాను" అని వివరించింది ఆ దేవతాస్త్రీ.

పిదప స్వయంప్రభ తన తపోబలముచే వానరవీరులందరినీ దక్షిణసముద్ర తీరమునకు చేర్చి, ఆమె ఆకాశ లోకమునకు వెళ్ళిపోయింది.

- సశేషం

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**వేదశాస్త్ర పురాణాని చేతిహాసాదికానిచ**
**మన్త్ర యన్త్రాది విద్యాశ్చ మోహనోచ్చాటనాదికమ్. 22**
**శైవ శాక్తా గమాదీని హ్యన్యేచ బహవోమతాః**
**అపభ్రంశాః సమస్తానాం జీవానాం భ్రాంత చేతసామ్. 23**
**జపస్తపోవ్రతం తీర్థం యజ్ఞోదానం తథైవచ**
**గురుతత్త్వ మవిజ్ఞాయ సర్వం వ్యర్థం భవేత్ప్రియే. 24**

**పదవిభాగము** :-

వేద-శాస్త్ర-పురాణాని-చ-ఇతిహాస-చ-మంత్ర-యంత్ర-ఆది-విద్యాః-చ-మోహన-ఉచ్చాటన-ఆదికమ్-శైవ-శాక్త-ఆగమాదీని-హి-అన్యే-చ-బహవో-మతాః-అపభ్రంశాః-సమస్తానాం-జీవానామ్-భ్రాంతచేతసాం-జపః-తపః-తీర్థం-యజ్ఞః-దానం - తథైవచ-గురుతత్త్వం- అవిజ్ఞాయ- సర్వం-వ్యర్థం-భవేత్-ప్రియే.

**టీక** :- గురుతత్త్వం=గురుతత్త్వం; అవిజ్ఞాయ=తెలిసికొనకపోయినచో; వేదశాస్త్ర పురాణానిచ=వేదములు, శాస్త్రములు, పురాణములు అనగా శ్రుతి స్మృతులు; ఇతిహాసాది కానిచ=ఇతిహాసములు, కావ్యములు మొదలగునవి, మన్త్ర యన్త్రాది విద్యాః=మంత్ర శాస్త్రములు, తంత్రశాస్త్రములు, యంత్ర శాస్త్రములు మొదలగు విద్యలు మోహనోచ్చాటనాది క్రియలు మొదలగునవి; శైవ శాక్తాగామాదీని= శైవాగమములు, శాక్తాగమములు మొదలైన షణ్మతాగమములు; అన్యేచ= ఇతరములైన; బహవోమతాః=అనేక మతములన్నియు; సమస్తానాం= సర్వ జీవానాం=జీవులకు,మానవులకు; అపభ్రంశాః= విరుద్ధములైన దుష్టార్థములనిచ్చును (అట్లే) జపః=జపము; తపః=తపము, వ్రతం=వ్రతము; తీర్థం= తీర్థాటనము; యజ్ఞః =యజ్ఞ యాగాదులు; దానం=దానమును; సర్వం= సర్వమును; వ్యర్థం=నిష్ఫలములు; భవేత్=అగును.

**వ్యాఖ్య** :- ఇరువది యొకటవ శ్లోకములో మూడు లోకములలోనూ ఒక్క గురువే సత్యమని చెప్పబడినది. గురువున కన్యమైనదంతా సత్యదూరమని తెలియజేయబడినది. శ్రుతి, స్మృత్యాది శాస్త్రములు, ఇతిహాసకావ్యాదులు, మన్త్ర, తన్త్ర, యన్త్రాది శాస్త్రములు, శైవ శాక్తాది ఆగమములు, సాంఖ్య, న్యాయ వైశేషికాది ఇతర మతములు, జప, తప, హెూమ, వ్రత, తీర్థాటన, యజ్ఞదానాది కర్మలు-అన్నీ జగత్తుకు సంభవించినవి. జగత్తు గురువుకాదు గనుక అసత్యమూ, అబద్ధమూ అవుతున్నది. అసత్తు నుండి పుట్టినది అసత్తే గనుక యీ ప్రయత్నమంతా నిష్ఫలమే అవుతున్నది. కాని యీ జగత్తుకు ఆధారమైన గురుదేవుడు సత్యము. గురుదేవుడు మాత్రమే సత్యమనే అవగాహన ఉంటే, పై చెప్పిన శాస్త్రములు వలనా కర్మల వలన ఎంత వరకు ప్రయోజనమో అంతవరకు వానిని చక్కగా వినియోగించు కొనవచ్చును. లేనిచో-అనగా-జగత్తుకు ఆధారం సత్య స్వరూపుడైన గురుదేవుడని గుర్తించకపోతే పై చెప్పబడిన శాస్త్రాదులు, కర్మలు, విరుద్ధా లూ అపభ్రంశములూ అయిన అర్థములను స్ఫురింపజేసి వ్యర్థములౌతవి అని హెచ్చరిస్తున్నాడు పరమశివుడు.

- సశేషం

**అచంచల భక్తి విశ్వాసాలతో సద్గురుపాదపద్మాలను ఆశ్రయించిన వారు భగవద్భక్తులవుతారు. బ్రహ్మజ్ఞానం పొందుతారు. ఆయన అలవరచే భగవత్ ధ్యానమార్గంలో చివరికి ఆ జగద్రక్షకుని చరణారవింద సన్నిధిని చేరుకుంటారు.**

**మనస్సు ప్రాపంచిక విషయాదులలో సంచరించడమే సంసార బంధం. మనస్సు ఆత్మయందు నిశ్చలత పొందడమే భవ బంధ రహితమగు మోక్షము.**

- శ్రీ బాబూజీ మహరాజ్

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీబుల్లిమామయ్య తెలిపిన శ్రీబాబు లీలలు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

24. ఒకరోజు భీమవరం తాతయ్యగారింట్లో శ్రీ బాబు హాల్లో కూర్చొని భక్తులతో మాట్లాడుతున్నారు. ఆ సమయంలో కృష్ణమూర్తిగారు వచ్చారు. శ్రీ బాబు "బావగారు వచ్చారు. కుర్చీ కుర్చీ" అంటుండగానే కృష్ణమూర్తిగారు "వద్దు వద్దు" అంటూ సరాసరి వచ్చి శ్రీ బాబు ఒడిలో కూర్చున్నారు. కూర్చున్నవారు కూర్చున్నట్లుండక, కృష్ణమూర్తిగారు తమ బరువునంతా శ్రీ బాబు కాళ్లపై మోపి, అటూ యిటూ కదులుతూ ఎలాగైనా శ్రీ బాబుకు నొప్పి కలిగించాలని, "నీ బరువు మోయలేను, లేవవయ్యా" అని శ్రీ బాబు చేత అనిపించుకోవాలని చాలా ప్రయత్నం చేశారు. అప్పట్లో శ్రీ బాబు చాలా సన్నగా ఉండేవారు. కృష్ణమూర్తిగారిది భారీ కాయమే. అయినా, శ్రీ బాబు తమ ఒడిలో బరువే లేనట్లుగా మందస్మిత వదనారవిందులై మాట్లాడుతూ కూర్చున్నారు. కృష్ణమూర్తిగారు ఎంత సేపు ప్రయత్నించినా ఫలితమేమీ లేకపోయింది.



ఇలా కొంతసేపు గడిచింది. అంతలో శ్రీ బాబు లేచి పనిమీద లోపలికి వెళ్లారు. కృష్ణమూర్తిగారు ఆ కుర్చీలో తాము కూర్చున్నారు. కొంత సేపటికి శ్రీ బాబు మళ్లీ తిరిగి వచ్చి కృష్ణమూర్తిగారి ఒడిలో కూర్చున్నారు.

శ్రీ బాబు కదలకుండానే కూర్చున్నారు. అయినా రెండు నిముషాలు గడిచే సరికి, కృష్ణమూర్తిగారు బాధగా "కాళ్ల మీద పెద్ద కొండ పెట్టినంత బరువుగా ఉంది బాబూ! భరించలేక పోతున్నాను. దయచేసి లేవండి" అన్నారు. శ్రీ బాబు "అదేమిటి బావగారూ? మీరు నా ఒడిలో కూర్చున్నంత సేపు, గుప్పెడు మల్లె పూలు నా ఒడిలో పోసినట్లున్నది. అందుకని, నేను మీ ఒడిలో కూర్చుంటే, మీకు మూడు మల్లె పూల కంటె ఎక్కువ బరువనిపించదు గదా అని కూర్చున్నాను" అన్నారు. కృష్ణమూర్తిగారు విలవిలలాడిపోతూ "మీరు ముందు నా ఒడిలో నుంచి దిగండి బాబూ! తరువాత మల్లెపూల లెక్క చూసుకోవచ్చు" అన్నారు. శ్రీ బాబు దిగారు. కృష్ణమూర్తిగారు తేరుకొని "బ్రతికించారు బాబూ! అలనాడు మీరు గోవర్ధన గిరిని కొనగోటితో పైకెత్తి అలాగే

పట్టుకున్నారన్న మాట గుర్తు లేక, నా లావూ, బరువూ మీకు చూపించాలని ప్రయత్నం చేశాను. నా బరువు గుప్పెడు మల్లెపూల వలె మీకు అనిపించటం సహజమే. కాని మూడు లోకాలూ మీ కుక్షిలోనే వున్నాయన్నమాట మీకు గుర్తులేక, "ఒక్క తులసీదళంతోనే తులతూగిన వాణ్ణి, మూడు మల్లె పూలకంటె ఎక్కువ బరువుండనులే" అనుకుని మీరు నా ఒళ్ళో కూర్చున్నారు. నా కాళ్ళు పచ్చడి అయిపోయాయి" అన్నారు.

25. ఒకసారి మాజేటి పున్నయ్యగారి కుటుంబం వారు శ్రీ బాబుతో పండరీపురం వెళ్ళి వచ్చాక, వారింట్లో శ్రీ సద్గురు పాదపూజ చేసుకున్నారు. పూజ పూర్తి కాగానే భక్తులు గులాబీలతో, జాజులతో కూర్చిన పూల గుత్తిని స్వామి చేతికిచ్చారు. స్వామి దానిని భక్తులకు చూపిస్తూ "చూశారా! నిజమైన భక్తుని హృదయం ఎప్పుడూ ఇలా వికసించి, మధురమైన భక్తి భావాలనే సువాసనలను వెదజల్లుతూ ఉంటుంది. అటువంటి భక్త హృదయంలోనే ఆ భక్త మనోహరుడు ఎప్పుడూ నివసిస్తూ ఉంటాడు. భక్త పుండరీకుడి హృదయంలో పాండురంగడు అలాగే నివశించాడు" అన్నారు. అది విని పున్నయ్యగారి భార్య ఆదిలక్ష్మమ్మగారు "బాబూ! ఒక్కసారి పాండురంగడి లాగా నిలబడి ఫోటో తీయించుకోండి" అని ప్రార్థించారు. శ్రీ బాబు "ఏం అమ్మా! నాలో ఉన్న పాండురంగణ్ణి అలా ఫోటోలో అయినా దర్శించుకుందామనా? అలాగేలే. ఏమయ్యా! కెమేరా మానూ! ఇప్పటికే చాలా ఫోటోలు తీశావు. నీ రీలులో ఇంకా ఖాళీ వున్నదా?" అని అడిగారు. అతను చూసి "ఒక్క ఫిలిమ్ మిగిలి ఉందండీ" అన్నాడు. "అంతేనయ్యా! చివరికి మిగిలేది ఎప్పుడూ ఒక్కటే. అదే వాడు. ఆ పాండురంగడు ఒక్కడే మనకు చివరికి మిగిలే దిక్కు. సరే! ఫోటో తీసుకో" అని శ్రీ బాబు నిలబడ్డారు. అతను "ఆ పూల గుత్తిని పట్టుకోండి" అన్నాడు. శ్రీ బాబు భక్తులను ఎలా రక్షించాలా అని తపనపడే ఆ కరుణాంతరంగడికి చేతిలో పూలగుత్తి పట్టుకుని నిలబడే అవకాశం ఎక్కడ ఉందయ్యా? ఏ భక్తుడు పిలుస్తాడో అని అతని రక్షణ కోసం ఎటెన్షన్‌లో నిలబడి చేతులు నడుంకు కట్టుకుని నిలబడటమే గదా ఆయన పని" అని అలా చేతులు పెట్టుకుని నిలబడ్డారు.

కెమేరా క్లిక్‌మంది. అందరి గుండెలు ఝల్లుమన్నాయి. మరునాడు ఫోటోలు అన్నీ వచ్చాయి. అందులో పాండురంగడి ఫోటోలో శ్రీ బాబు తేరిచూడరాని తేజో మూర్తిగా, **జ్యోతిర్జ్వలతి బ్రహ్మాహమస్మి** అన్నట్లుగా తమ నిజదర్శనం అనుగ్రహించారు.

- సశేషం

(గత సంచిక తరువాయి) విష్ణు కథలు -రమణ ప్రసాద్

# భక్త రామదాసు

ఇలా సంతోషంగా గడిపే రామదాసును డబ్బు ఇవ్వమని వత్తిడి చేసి చెరసాలలోని అధికారులు పెట్టే బాధలు లెక్కచేయకుండా "అంతా రాముని దయ!" అని నవ్వుతూనే ఉన్నాడని అతని గురించి భటులు తానీషాకు తెలియచేశారు. మంచి మాటలతో ఇవ్వటం లేదు కనుక వీపుమీద ఇనుప గుండ్లు కట్టి పుర వీధులలో తిప్పమని, ఇంకా బాధలు పెట్టి వత్తిడి తెమ్మని ఆజ్ఞ జారీ చేశాడు నవాబు. రామదాసును ఒక్కొక్క జాములో ముళ్ళకంప మీద నడిపించారు. ముళ్ళమీద నడుస్తూ రామదాసు "కానలలో నువ్వు తిరిగినప్పుడు ఎన్ని ముళ్ళు గుచ్చుకున్నాయో? ఎలా ఓర్చుకున్నావో రామా? అన్ని కష్టాలకోర్చి రాక్షస సంహారం చేసి అయోధ్యకు వచ్చి సుఖంగా రాజ్యం ఏలిన రీతిగా నన్నుకూడా ఈ బాధలనుండి రక్షించమ"ని వేడుకున్నాడు.



చేతులు రెండూ కట్టేసి కొడుతూ ఉంటే "నిరపరాధిని అయిన నన్నా దుర్జనులు హింసిస్తూవుంటే చూస్తూ ఊరుకొన్నావేమిరా" అని వాపోయాడు. "తానీషా డబ్బు ఇస్తావా లేదా?" అని గద్దిస్తే "నీది అనుకున్న ధనం అంతా శ్రీ రామచంద్రునికి వినియోగ పడినందున నువ్వు తరించావయ్యా! తిరిగి ఆ ధనాన్ని ఆశిస్తే నరకానికి పోతావు సుమా!" అని హెచ్చరించాడు. తానీషా కోపం తారాస్థాయినంటి, ఇంకా చిత్ర హింసలు పెట్టమన్నాడు. భటులు చిత్రహింసలు పెడుతూంటే రాముని మనస్సులో నిలిపి తన్మయత్వంలో ఉండేవాడు. పాపం చనిపోయాడు అని భటులు అనుకుంటూ ఉంటే నవ్వుతూ లేచి నుంచునేవాడు.

"ఈ బాధలు ఎలా భరిస్తున్నావు?" అని భటులు ఆశ్చర్యంతో అడిగితే, "సర్వకాల సర్వావస్థలయందు రాముని యందు దృఢభక్తి కలిగి ఉండటమే కారణం" అని వారికి భక్తి తత్త్వాన్ని బోధించాడు. రామ నామ రుచి ఎటువంటిదో వారికి చూపించాడు.

శ్రీరామ నీ నామ మేమి రుచిరా – ఓ రామ నీ నామ మెంత రుచిరా
కదళి ఖర్జూరాది ఫలముల కధికము – పావన నీనామ మేమి రుచిరా
నవరసములకన్న నవనీతము కంటె నధికమౌ నీనామమేమి రుచిరా
సదాశివుండును సదా భజించెడి సదానంద నీ నామమేమి రుచిరా
అరయ భద్రాచల శ్రీరామదాసుని ఏలిన నీనామమేమి రుచిరా ॥

భటులు తనను బాధలకు గురి చేస్తుంటే రాముని స్మరిస్తూ


పాహిమాం శ్రీ రామా యంటె పలుకవైతివి। నీ స్నేహ మిట్టిదని
చెప్పనోహొహొ హొహొహొహొ
ఇబ్బంది నొందిన యా కరి బొబ్బ పెట్టిననంత లోన
గొబ్బున గాచితివట జాగుచేయక
నిబ్బరముతో నే నెంతో కబ్బమిచ్చి వేడుకొన్న తబ్బిబ్బు జేసెదవు
రామా అబ్బ బ్బ బ్బ బ్బ బ్బ బ్బో
చయ్యన భద్రాద్రి నిలయ స్వామివని నమ్మి నేను। వేయారు
విధములనుతి చేయ సాగితి
యియ్యెడను రామదాసుని కుయ్యాలించి బ్రోవకున్న। నీ
యొయ్యారమేమనవచ్చు నయ్యయ్యయ్యయ్యయ్యో
చరణములే నమ్మితి । నీ దివ్య చరణములే నమ్మితి – అని దీనంగా వేడుకొన్నాడు.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

ఏప్రియల్ 11 నుండి 15 వరకు శ్రీ కాళహస్తి శుకబ్రహ్మాశ్రమంలో జరిగిన
శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారి 25వ ఆరాధనా ఉత్సవాలలో పాల్గొన్న శ్రీ మాతాజీ





ఏప్రియల్ 11 నాడు శ్రీ సుబ్బదాస స్వామి వారి ఆరాధనోత్సవంలో పాల్గొన్న శ్రీ మాతాజీ.





REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## ఏప్రియల్ 23 నుండి 27 వరకు షోలాపూర్ నగరంలో జరిగిన సత్సంగ కార్యక్రమ దృశ్యములు








If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.